




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 304 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 10 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :304 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 10 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## పోలీసులకు మరోసారి సీరియస్ వార్నింగ్ ఇచ్చిన జగన్

- రైతుల పట్ల పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ జగన్
- ఎల్లకాలం ఇదే ప్రభుత్వం ఉండని పోలీసులకు హెచ్చరిక
- రాబోయేది జగన్ ప్రభుత్వమనేది గుర్తుంచుకోవాలని వ్యాఖ్య

వివరాలు 2లో..



## మంత్రులకు చంద్రబాబు వార్నింగ్



- మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
- విపక్షాల తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని ఆదేశం
- పనితీరు బాగోకపోతే కొత్తవారికి అవకాశం ఇస్తానని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:పనితీరు మెరుగుపరుచుకోకపోతే పదవులు ఉండవంటూ తన కేబినెట్ సహచరులకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టడంలో విఫలమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన మంత్రుల పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రస్తుత రాజకీయాలు కేవలం సబ్జెక్టు ఆధారంగా కాకుండా, ప్రచారాలపైనే ఎక్కువగా నడుస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మంత్రులు అన్ని విషయాలపై సకాలంలో స్పందించాలని గట్టిగా సూచించారు. "విపక్షాల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడే తిప్పికొట్టకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. మీరు సరిగా స్పందించకపోతే మీ స్థానంలో కొత్తవాళ్లు వస్తారు. ఇక మంత్రులు రోజులు లెక్కపెట్టుకోవాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు.వైసీపీ నాయకులు మహిళల పట్ల కూడా అసభ్యంగా మాట్లాడుతున్నారని, వారి నిజ స్వరూపాన్ని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత మంత్రులపై ఉందని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వానికి నష్టం కలిగించే ఏ చిన్న విషయాన్ని కూడా ఉపేక్షించవద్దని, ప్రజాక్షేత్రంలో వాస్తవాలను బలంగా వినిపించాలని ఆయన ఆదేశించారు.

## రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక ఏం చేస్తానంటే?



- రాజకీయాల నుంచి వైదొలిగాక తన ప్రణాళిక చెప్పిన అమిత్ షా
- వేదాలు, ఉపనిషత్తులు చదువుతానన్న కేంద్ర మంత్రి
- ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడతానని వెల్లడి
- రసాయన ఎరువులతో ఆరోగ్య సమస్యలని హెచ్చరిక
- హెూం శాఖ కన్నా సహకార శాఖే తనకు పెద్దదని వ్యాఖ్య

వివరాలు 2లో..

## పవన్ ను కలిసిన ఏపీ బీజేపీ నూతన అధ్యక్షుడు



- జనసేన కార్యాలయంలో పవన్ ను కలిసిన మాధవ్
- మాధవ్ కు శుభాకాంక్షలు తెలిపిన పవన్
- కూటమి కార్యాచరణ, సమన్వయంపై కీలక చర్చలు

పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు మాధవ్ భేటీ అయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి మాధవ్ వెళ్లారు. ఈ సందర్భంగా మా ధవ్‌ను పవన్ శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియ జేశారు. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీగానే కాకుండా, రెండు పార్టీల మధ్య రాజకీయ సమన్వయంపై చర్చించేందుకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో ప్రధానంగా కూటమి ప్రభుత్వ కార్యాచరణ, ప్రభుత్వంలో భాగస్వామ్యం, భవిష్యత్ రాజకీయ

వివరాలు 2లో..

## రేషన్ బియ్యం అక్రమార్కులపై ఉక్కుపాదం: మంత్రి మనోహర్ కీలక ఆదేశాలు

- రాష్ట్రం నుంచి బియ్యం ఎగుమతులకు ఎలాంటి అభ్యంతరం లేదు
- రేషన్ బియ్యాన్ని కలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- అక్రమార్కులపై పీడీ యాక్ట్, బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు
- కాకినాడ, విశాఖ, నెల్లూరు పోర్టుల వద్ద 24/7 చెక్ పోస్టులతో నిఘా
- జాతీయ రహదారులపైనా తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశం
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు పెంచాలని మంత్రి సూచన



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుంది. పేదల కోసం ఉద్దేశించిన సబ్సిడీ బియ్యాన్ని అక్రమంగా ఎగుమతి చేసే వారిపై పీడీ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కఠిన కేసులు నమోదు చేయాలని

వివరాలు 2లో..

## చైనాతో కాదు, టిబెట్‌తోనే మాకు సరిహద్దు

అరుణాచల్ సీఎం పెమా ఖండు కీలక వ్యాఖ్యలు



- అరుణాచల్‌కు చైనాతో సరిహద్దు లేదన్న సీఎం పెమా ఖండు
- తమ సరిహద్దు టిబెట్‌తోనేనని వ్యాఖ్య
- టిబెట్‌ను చైనా బలవంతంగా ఆక్రమించుకుందని వెల్లడి

వివరాలు 2లో..

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

- ఐపీఎల్ టికెట్ల వివాదంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు అరెస్ట్
- జగన్మోహనరావుతో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్న సీఐడీ
- గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలెత్తిన గొడవ
- విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీఐడీ చర్యలు
- ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చినట్టు నిర్ధారణ
- కార్పొరేట్ బాక్స్‌కు తాళం వేయడంతో ముదిరిన వివాదం



పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహనరావును సీఐడీ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంచైజీతో టికెట్ల విషయంలో తలెత్తిన వివాదమే ఈ అరెస్టుకు దారితీసింది. ఆయనతో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు.గత ఐపీఎల్ సీజన్ సందర్భంగా హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం మధ్య టికెట్ల కేటాయింపుపై తీవ్ర విభేదాలు తలెత్తాయి. తమకు టికెట్లు కేటాయించలేదనే కారణంతో హెచ్‌సీఏ

వివరాలు 2లో..

## ముగ్గురు మూర్ఖులు జగన్ ను ఆపగలరా?

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని తీవ్ర ఆగ్రహం
- జగన్ చిత్తూరు పర్యటనను అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు
- రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదని తీవ్ర విమర్శ



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ పర్యట నల ను అడ్డుకోవ డానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, కానీ "ముగ్గురు మూరు?లు కలిసి జగన్‌ను ఆపగల రా?" అని మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అరచే తిని అడ్డుపెట్టి సూర్యరశ్మిని ఆపడం ఎవరివల్లా

వివరాలు 2లో..

## ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలు.. ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ కీలక భేటీ

- ఢిల్లీలో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో సమావేశమైన డీకే శివకుమార్
- కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై మళ్లీ ఊపందుకున్న ఊహాగానాలు
- ప్రియాంక గాంధీతో భేటీ అనంతరం మాట్లాడకుండా వెళ్లిన శివకుమార్
- త్వరలో అధిష్టానంతో సిద్ధరామయ్య కూడా భేటీ అయ్యే అవకాశం

పెన్ పవర్ డెస్క్:కర్ణాటక రాజకీయాల్లో ము ఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చనీ యాం శమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీతో సమావేశం కావడంతో

వివరాలు 2లో..



## వారిని కాల్చిపారేయండి

## షేక్ హసీనా ఆడియో లీక్.. బంగ్లాదేశ్‌లో కలకలం

- బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా సంచలన ఆడియో లీక్
- నిరసనకారులను కాల్చివేయాలని పోలీసులకు ఆదేశాలు
- గత ఏడాది రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనల నాటి ఘటన
- బీబీసీ పత్రాల ఆధారంగా వెలుగులోకి వచ్చిన ఉదంతం
- అల్లర్లలో 1400 మంది మృతి చెందారని ఐక్యరాజ్యసమితి అంచనా
- ప్రస్తుతం భారత్‌లో తలదాచుకుంటున్న షేక్ హసీనా



పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సంబంధించిన ఒక కీలకమైన ఆడియో లీక్ కావడంతో రాజకీయంగా పెను ప్రకం పనలు సృష్టిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు వ్యతిరేకం గా గత సంవత్సరం జరిగిన ఆందోళనల సమయంలో నిరసనకా రులపై కాల్పులు జరపాలని ఆమె స్వయంగా ఆదేశించినట్లు ఈ ఆడియోలో ఉంది. ఈ ఉదంతం ఇప్పుడు బంగ్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.బీబీసీకి చెందిన పత్రాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా

వివరాలు 2లో..

## పక్కా ప్రణాళికతోనే జగన్ పర్యటనలు చేస్తున్నారు



- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారన్న అచ్చెన్నాయుడు
- ఐదారు జిల్లాల నుంచి జనాలను తరలించడం ఎందుకని ప్రశ్న
- పథకం ప్రకారమే రోడ్లపై మామాడి పండ్లు పోశారని విమర్శ

పెన్ పవర్ డెస్క్: వైసీపీ అధినేత జగన్ చేపడుతున్న పర్యటనలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన జగన్‌కు లేదని, కేవలం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే పక్కా ప్రణాళికతో యాత్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

## మంత్రులూ ఇక రోజులు లెక్క పెట్టుకోండి.. చాలా టైం చూశా

మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక రోజులు లెక్కపెట్టుకోవాల్సిందేనని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంత్రి పదవి చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ ఇంకా మంత్రుల పనితీరును మార్చుకోకుంటే ఎలా అని ప్రశ్నించారు. అసలు మంత్రులు ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉందని అసహనం వ్యక్తం చేశారు. విపక్షాలు చేస్తున్న విమర్శలకు సరైన కౌంటర్ ఇవ్వడంలో కూడా మంత్రులు విఫలమవుతున్నారని, వైసీపీ నేతలు మహిళ ఎమ్మెల్యేలను కించపర్చే విధంగా మాట్లాడినా స్పందించకుండా మౌనం పాటించడమేంటని కటువుగానే ప్రశ్నించారు. మీ స్థానంలో కొత్త వారు వస్తారని కూడా చంద్రబాబు హెచ్చరించారు.

**1995 నాటి సీఎంను చూస్తారని...**

ఇక తనలో 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారని, ఇప్పటి వరకూ పనితీరును మార్చుకుంటారేమోనని వెయిట్ చేశానని, కానీ కనీసం విపక్షాల విమర్శలకు సమాధానం చెప్పడంలో కానీ, ప్రభుత్వం ఏడాదిగా చేస్తున్న మంచి పనులను, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంలో కానీ ఫెయిలయ్యారని మంత్రులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గతంలో కాంగ్రెస్ తో పోరాటం అంటే సబ్జెక్ట్ పైనే ఉండేదని, ఇప్పుడు పూర్తిగా మారిపోయిందని, ప్రభుత్వం పై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు కౌంటర్ ఇవ్వగలిగేతే మనగలుగుతామని గుర్తుంచుకోవాలని చంద్రబాబు సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చినట్లుతెలిసింది. కొత్త వారిని మంత్రులుగా తీసుకు రావడం తనకు క్షణాల్లో పని అని, కానీ ఆ పరిస్థితి కొందరు తెచ్చుకునేలా ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**వ్యవసాయశాఖపై...**

సరిగా తమకు అప్పగించిన శాఖలపై కనీసం సమీక్షలు నిర్వహించడం లేదని, కొందరు జిల్లాల పర్యటనలకు కూడా వెళ్లడం లేదని ఫైర్ అయ్యారు. విపక్ష నేత జగన్ మిర్చి, పొగాకు ఈరోజు మామిడి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమయిందంటూ రోడ్డెక్కుతుంటే ఒక్కరూ మాట్లాడలేరా? ప్రభుత్వం రైతుల కోసం చేసిన పనిని ప్రజలకు వివరించలేరా? అని గట్టిగానే నిలదీసినట్లు తెలిసింది. వ్యవసాయ శాఖపైనే ఎక్కువగా విపక్షాలు విమర్శలు చేస్తున్నారని, ప్రతి ఒక్క మంత్రి సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మంత్రులు పార్టీ కార్యకర్తలకు, నాయకులకు గౌరవం ఇవ్వాలని కూడా చంద్రబాబు అన్నారు. అలా చేయకుండా ఉంటే మంత్రులను కేబినెట్ నుంచి తొలగిస్తానని గట్టిగానే హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది.

# పోలీసులకు మరోసారి సీరియస్ వార్నింగ్ ఇచ్చిన జగన్

"ఎల్లకాలం ఇదే ప్రభుత్వం అధికారంలో ఉండదు. రేపు రాబోయేది జగన్ ప్రభుత్వం. ఈ విషయం గుర్తుంచుకోండి" అంటూ హెచ్చరికలు జారీ చేశారు. గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న మామిడి రైతులను పరామర్శించేందుకు బుధవారం ఆయన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా రైతుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతుల తలలు పగలగొడతారా? 1,200 మందిని జైళ్లలో పెడతారా? అసలు రాష్ట్రంలో ఉంది పోలీసులా? రాక్షసులా?" అంటూ జగన్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. రైతులను రౌడీ షీటర్లలా పరిగణిస్తూ దురుసుగా ప్రవర్తించడం సరికాదని మండిపడ్డారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ ప్రలోభాలకు, ఇచ్చే లంచాలకు లొంగవద్దని పోలీసులకు హితవు పలికారు. "రేపు ఇదే చంద్రబాబు మిమ్మల్ని కూడా మోసం చేయొచ్చు. అప్పుడు మీ తరపున పోరాటం చేయాల్సి వచ్చేది కూడా నేనే" అని జగన్ అన్నారు. కనీస మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మామిడి రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, వారి పక్షాన నిలబడతానని భరోసా ఇచ్చారు. జగన్ పర్యటనతో బంగారుపాళ్యంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

## రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక ఏం చేస్తానంటే?

రాజకీయ జీవితం నుంచి విరమణ పొందిన తర్వాత తాను ఏమి చేయాలనుకుంటున్నారో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. తన భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రజా జీవితానికి వీడ్కోలు పలికిన తర్వాత పూర్తి సమయం వేదాలు, ఉపనిషత్తుల అధ్యయనానికి కేటాయిస్తానని తెలిపారు. దీనితో పాటు ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి సారిస్తానని చెప్పారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన సహకార సంఘాల మహిళలతో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రసాయన ఎరువులతో పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సేద్యం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని, అదే సమయంలో వ్యవసాయ ఉత్పాదకతను కూడా పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా సహకార శాఖ మంత్రిగా తన బాధ్యతల గురించి కూడా అమిత్ షా

మాట్లాడారు. తనకు హోం శాఖ అప్పగించినప్పుడు అందరూ అది కీలక శాఖ అన్నారని, కానీ సహకార శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు హోం శాఖ కన్నా అదే పెద్ద శాఖ అని తాను భావించానని అన్నారు. దేశంలోని రైతులు, పేదలు, గ్రామాల సంక్షేమం కోసం ఈ శాఖ పనిచేస్తుండటమే దీనికి కారణమని ఆయన వివరించారు.

## చైనాతో కాదు, టిబెట్‌తోనే మాకు సరిహద్దు

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు, చైనాకు గట్టి షాకిచ్చేలా కీలక వ్యాఖ్యలు చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చైనాతో అసలు సరిహద్దే లేదని, తమ రాష్ట్రానికి టిబెట్‌తో మాత్రమే సరిహద్దు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై కొత్త చర్చకు దారితీశాయి.

ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పెమా ఖండు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా, అరుణాచల్ ప్రదేశ్ చైనాతో 1200 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటుందని విలేకరి ప్రస్తావించగా, సీఎం ఖండు వెంటనే కలగజేసుకున్నారు. "ఈ విషయంలో నేను మిమ్మల్ని సరిదిద్దాలి. మాకు చైనాతో కాదు, టిబెట్‌తో సరిహద్దు ఉంది" అని ఆయన వివరించారు. భారతదేశంలోని ఏ రాష్ట్రానికీ చైనాతో సరిహద్దు లేదని ఆయన అన్నారు. చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ, 1950లో చైనా టిబెట్‌ను బలవంతంగా ఆక్రమించుకుందని పెమా ఖండు గుర్తుచేశారు. "అధికారికంగా టిబెట్ ఇప్పుడు చైనా ఆధీనంలో ఉందని మాకు తెలుసు. కానీ వాస్తవానికి మా సరిహద్దు ఎప్పుడూ టిబెట్‌తోనే ఉండేది. అరుణాచల్ ప్రదేశ్ భూటాన్, మయన్మార్‌లతో పాటు టిబెట్‌తో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటోంది" అని ఆయన తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌ను తమ భూభాగంలోని దక్షిణ టిబెట్ (జాంగ్నాన్) అని చైనా చాలాకాలంగా వాదిస్తోంది. తమ మ్యాపుల్లో కూడా చూపిస్తూ వివాదాన్ని రాజేస్తోంది. అయితే, చైనా వాదనలను భారత్ ఎప్పటికప్పుడు తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని తేల్చి చెబుతోంది. ఈ నేపథ్యంలో పెమా ఖండు చేసిన వ్యాఖ్యలు చైనా వాదనను మరింత బలహీనపరిచేలా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## రేషన్ బియ్యం అక్రమార్కులపై ఉక్కుపాదం: మంత్రి మనోహర్ కీలక ఆదేశాలు

- మొదటి పేజీ తరువాయి

అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అయితే, నిబంధనలు పాటిస్తూ చేసే చట్టబద్ధమైన బియ్యం ఎగుమతులకు తమ ప్రభుత్వం వ్యతిరేకం కాదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి మనోహర్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎగుమతి చేసే బియ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పీడీఎస్ బియ్యం కలవకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తేల్చిచెప్పారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రంలోని కీలకమైన కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం (నెల్లూరు) పోర్టుల వద్ద 24/7 పనిచేసేలా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరాన్ని బట్టి మరిన్ని చెక్‌పోస్టులను పెంచాలని సూచించారు.

కాకినాడ పోర్టులో నియంత్రణ మెరుగ్గా ఉందని, ఇదే తరహా పటిష్టమైన నిఘాను విశాఖ, నెల్లూరు పోర్టుల వద్ద కూడా అమలు చేయాలన్నారు. జాతీయ రహదారులపై కూడా అనుమానం ఉన్నచోట తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి నిఘా ముమ్మరం చేయాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ రవాణాపై ఇప్పటికే కేసులు నమోదవుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. కాకినాడ జిల్లాలో 85, విశాఖపట్నంలో 92, నెల్లూరు జిల్లాలో 62 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీటిలో పోర్టు ప్రాంతాలకు సంబంధించిన కేసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

అధికారులు సన్‌రైజర్స్‌కు చెందిన కార్పొరేట్ బాక్స్‌కు తాళం వేయడం వివాదాస్పదమైంది. హెచ్‌సీఏ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం హైదరాబాద్ నుంచి తమ ఫ్రాంచైజీని తరలిస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలోనే హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావుపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు, జగన్మోహనరావు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చినట్లు తమ నివేదికలో నిర్ధారించారు. ఆ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసిన సీఐడీ, తాజాగా జగన్మోహనరావును అరెస్ట్ చేసి విచారణ చేపట్టింది.

## ముగ్గురు మూర్ఖులు జగన్ ను ఆపగలరా?

- మొదటి పేజీ తరువాయి

కాదని, అలాగే జగన్‌ను కూడా ఎవరూ నిలువరించలేరని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ చిత్తూరు పర్యటన ఖరారవ్వగానే ప్రభుత్వం భయపడిపోయిందని పేర్ని నాని ఎద్దేవా చేశారు. "జగన్ వస్తున్నారని తెలిసి మార్కెట్ యార్డును మూసివేయించారు. పంట కొనే వ్యాపారులను, రైతులను రావొద్దని అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం" అని ఆయన అన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర కష్టాల్లో ఉంటే, వారి గోడు వినే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

"164 సీట్లు గెలిచామని జబ్బలు చరుచుకుంటున్న కూటమి నేతలు, ప్రజల సొమ్ముతో హెలికాప్టర్లలో తిరుగుతూ సోకులు చేసుకుంటున్నారు. కానీ ధాన్యం, పెసలు, మినుముల రైతులకు గిట్టుబాటు ధర దొరక్క అల్లాడుతుంటే పట్టించుకోవడం లేదు. ఇది రాష్ట్రానికి పట్టిన దరిద్రం" అని నాని విమర్శించారు. మామిడి రైతులను పరామర్శించేందుకు జగన్ వస్తానని చెప్పేంతవరకు ప్రభుత్వానికి స్పృహే లేదని అన్నారు. తాము 3.5 లక్షల టన్నుల మామిడి కొన్నామని, సబ్సిడీ ఇచ్చామని ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ అబద్ధాలని, ఒక్క రైతుకైనా లబ్ధి చేకూరినట్లు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. మీకు నిజంగా చేతనైతే మామిడికి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

## వారిని కాల్చిపారేయండి షేక్ హసీనా ఆడియో లీక్.. బంగ్లాదేశ్‌లో కలకలం

- మొదటి పేజీ తరువాయి

సంస్థలు ఈ వార్తను ప్రచురించాయి. దీని ప్రకారం, గత సంవత్సరం జులై 18న ఢాకాలోని తన అధికార నివాసం 'గణభబన్' నుంచి ఒక ఉన్నత పోలీస్ అధికారికి హసీనా ఫోన్‌లో ఈ ఆదేశాలు జారీ చేశారు. "నిరసనకారులను అణచివేయడానికి ప్రాణాంతక ఆయుధాలు వాడండి. వాళ్లు ఎక్కడ కనిపిస్తే అక్కడ కాల్చేయండి" అని ఆమె ఆదేశించారు. ఈ ఆదేశాలు జారీ అయిన కొద్ది గంటలకే పోలీసులు నిరసనకారులపై బలప్రయోగం చేసినట్లు బీబీసీ నివేదిక వెల్లడించింది. కాగా, బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి తీవ్ర అల్లర్లకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో సుమారు 1,400 మంది మరణించినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఈ నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. అనంతరం ఆమె దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తిరిగి దేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆమెపై బంగ్లాదేశ్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించడం కూడా గమనార్హం.

## పవన్ ను కలిసిన ఏపీ బీజేపీ నూతన అధ్యక్షుడు

- మొదటి పేజీ తరువాయి

వ్యూహాలపై ఇరువురు నేతలు చర్చించారు. ముఖ్యంగా, మిత్రపక్షాలైన జనసేన, టీడీపీ, బీజేపీల మధ్య మరింత సమన్వయం పెంచుకోవడమే లక్ష్యంగా వీరి మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.

కాగా, అంతకుముందు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాధవ్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. గతంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేసిన మాధవ్‌కు ఆర్ఎస్ఎస్, బీజేవైఎంలో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది.

## పక్కా ప్రణాళికతోనే జగన్ పర్యటనలు చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

జగన్ పర్యటనలు సినిమా సెట్టింగుల్లా ఉన్నాయని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. "పరామర్శకు వెళ్తే రైతులను కలిసి మాట్లాడాలి కానీ, ఐదారు జిల్లాల నుంచి జనాన్ని తరలించడం ఎందుకు? ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే రోడ్లపై మామిడి పండ్లను పోశారు. ఇది క్రిమినల్ మైండ్‌తో చేసే పని" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి చర్యలతో సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు.

తోతాపురి మామిడి రైతుల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈసారి 7 లక్షల మెట్రిక్ టన్నుల బంపర్ క్రాప్ రావడం, పల్ప్ పరిశ్రమల వద్ద గతేడాది నిల్వలు ఉండటంతో ధర పడిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో, పరిశ్రమలతో మాట్లాడి కిలో మామిడిని రూ. 8కి కొనేలా ఒప్పించామని, ప్రభుత్వం తరఫున కిలోకు రూ. 4 చొప్పున సాయం అందిస్తున్నామని వివరించారు. ఇప్పటికే అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటున్న తర్వాత కూడా జగన్ పర్యటనలు చేయడం వెనుక దురుద్దేశం ఉందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలన్నదే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు.

## ముఖ్యమంత్రి మార్పు ఊహాగానాలు.. ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ కీలక భేటీ

- మొదటి పేజీ తరువాయి

ఈ ఊహాగా నాలకు మరింత బలం చేకూరినట్లయింది. ముఖ్యమంత్రి పదవి విషయంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠ ఈ భేటీతో తారాస్థాయికి చేరింది.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవిపై సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్య ఒప్పందం జరిగిందనే ప్రచారం బలంగా ఉంది. దీని ప్రకారం, తొలి రెండున్నరేళ్లు సిద్ధరామయ్య, ఆ తర్వాత మిగిలిన కాలానికి డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఒప్పందం ప్రకారమే త్వరలో డీకే ముఖ్యమంత్రి అవుతారని ఆయన వర్గం ఎమ్మెల్యేలు, మద్దతుదారులు బహిరంగంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కావాలనే తన ఆశను శివకుమార్ కూడా దాచుకోవడం లేదు. ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, "పదవిని ఆశించడంలో తప్పేముంది?" అంటూ తన మనసులోని మాటను పరోక్షంగా బయటపెట్టారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాత్రం తాను ఐదేళ్ల పూర్తికాలం పదవిలో కొనసాగుతానని ధీమాగా చెబుతున్నారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రియాంక గాంధీతో డీకే శివకుమార్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు. త్వరలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశమయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## జనసేనలో చేరుతున్నారనే వార్తలపై వైసీపీ నేత జక్కంపూడి క్లారిటీ

తమ కుటుంబం జనసేన పార్టీలో చేరుతోందంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని రాజానగరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత జక్కంపూడి రాజా స్పష్టం చేశారు. తాము జగన్ వెంటే నడుస్తామని తేల్చిచెప్పారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ పదవిలో ఉండి కూడా బాధ్యతలు నిర్వర్తించకుండా సినిమాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. పదవిలో లేకపోయినా తాము నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నామని అన్నారు. "ఎన్నికల ముందు ఒక మహిళకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసిన పవన్, ఇప్పుడు రాష్ట్రంలో ఎంతోమంది మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ఆయన నిలదీశారు. కొందరు జనసేన సైకో ఫ్యాన్స్ తమపై పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రాజకీయంగా గుర్తింపు కోసమే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సినిమాలు, రాజకీయాలు వేర్వేరని, తమ కుటుంబానికి మెగాస్టార్ చిరంజీవిపై ఎనలేని అభిమానం ఉందని జక్కంపూడి రాజా స్పష్టం చేశారు. తమ తమ్ముడి వివాహానికి ఆహ్వానించేందుకు వెళ్లినప్పుడు, జక్కంపూడి కుటుంబం రాజకీయాల్లో ఉండాలని చిరంజీవి ఆకాంక్షించారని ఆయన గుర్తుచేసుకున్నారు. ఇదే సమావేశంలో, ఆంధ్ర పేపర్ మిల్లు కార్మికుల సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. జులై 14వ తేదీలోగా కార్మికుల డిమాండ్లు పరిష్కరించకపోతే, తాను గానీ, తన తల్లి గానీ ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు హామీలిచ్చిన మంత్రి కందుల దుర్గేశ్, ఎంపీ పురందేశ్వరి, ఇతర ఎమ్మెల్యేలు ఇప్పుడు ముఖం చాటేశారని ఆయన ఆరోపించారు.

# మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



**తిరుపతి పెన్ పవర్ జూలై 9 :** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు బుధవారం మహాపూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాల పూజ, హెూమం, మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టుపవిత్ర సమర్పణ చేపట్టారు. మధ్యాహ్నం 03.00 – 03.30 గం.ల మధ్య అభిషేకం, అనంతరం అలంకారం, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం పంచమూర్తులైన శ్రీ వినాయక స్వామి, వళ్లి దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి, శ్రీ కపిలేశ్వర స్వామి, శ్రీ కామాక్షి అమ్మవారు, శ్రీ చండికేశ్వరస్వామివారి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు పవిత్రమాల, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# బిగ్, జనతా క్యాంటిన్‌లలో నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలి

## టిటిడి ఈవో జె.శ్యామలరావు



**తిరుమల పెన్ పవర్ జూలై 9 :** తిరుమలలో శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు బిగ్, జనతా క్యాంటిన్లలోనాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు కోరారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో గుర్తింపు ఉన్న హెూటళ్ల నిర్వాహకులతో బుధవారం టిటిడి అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మ్లాట్లాడుతూ, శ్రీవారి దర్శనం కోసం ప్రపంచ వ్యాప్తంగా భక్తులు వస్తుంటారని, వారికి సేవా దృక్పథంతో నాణ్యమైన ఆహార పదార్థాలు, పరిశుభ్రత, లాభాపేక్ష లేకుండా నిర్దేశించిన ధరలకు అందించాలన్నారు. తిరుమలలో బిగ్, జనతా క్యాంటిన్ల నిర్వహణ కోసం గత నెల 23వ తేదీ నోటిఫిషన్ జారీ చేశారు. సదరు ఈవోఐ సంబంధించిన సందేహాలపై గుర్తింపు ఉన్న హెూటళ్ల నిర్వాహకులు తమ ఆసక్తిని వ్యక్తం చేసేందుకు ప్రీ బిడ్ మీటింగ్ ను టిటిడి ఈవో జె. శ్యామల రావు, టిటిడి అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి నిర్వహించారు. తిరుమలలో బిగ్, జనతా హెూటళ్ల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత పాటించాలని, లాభాపేక్ష లేకుండా నిర్దేశించిన ధరల ప్రకారం ఆహార పదార్థాలను అందించాలని వారిని ఈవో, అదనపు ఈవో కోరారు. నిర్ధారించిన నియమాలకు లోబడి బిగ్, జనతా క్యాంటిన్ లో కేటాయింపు ఉంటుందని ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమావేశంలో బిగ్, జనతా హెూటళ్ల నిర్వహణలో టెండర్ ప్రాసెస్ మరియు తదితర నియమ నిబంధనలను గుర్తింపు, ఆసక్తి ఉన్న హెూటళ్ల నిర్వాహకులు నివృత్తి చేసుకున్నారు. హెూటళ్ల నిర్వాహకులు పలు సందేహాలు వ్యక్తం చేయగా వాటిని టిటిడీ ఈవో, అదనపు ఈవో నివృత్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎఫ్.ఏ.ఓ రవి ప్రసాదు, తిరుమల ఎస్టేట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు, ఆసక్తి, గుర్తింపు ఉన్న పలు హెూటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల కేటాయింపులు త్వరితగతిన పూర్తి కావాలి

## - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ





**అనంతపురం, పెన్ పవర్ జులై 09 :** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వ భూముల కేటాయింపులు త్వరితగతిన పూర్తి కావాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంత పురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్ పై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా రిజిస్టర్, డీఎస్ఓ, తహసిల్దార్ లు, ఆర్ఎస్డిటిలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 544డికి సంబంధించి తాడిపత్రి మండలంలో అధిక శాతం భూమి సేకరణ పెండింగ్ ఉందని, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు వారంలోగా పంపించాలన్నారు. ఈ విషయమై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి యాడికి మండలంలో కొంత ప్రభుత్వ భూమిని అప్పగించడం జరగగా, మిగతా భూమికి సంబంధించి రెండు వారాల్లోపు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఏపీఐఐసికి సంబంధించి గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామంలో అర్హులైన పట్టదారులకు ఆర్డీఓ ద్వారా నష్టపరిహారం చెల్లించాలని, ఇందుకు సంబంధించి రెండు రోజులలోపు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టిపెట్టాలని, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, కలెక్టరేట్ రిసెప్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం విజయవంతం : కలెక్టర్

### తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలి

### తొలిసారి ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ నిర్వహణకు శ్రీకారం

**- జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి**



**నంద్యాల, పెన్ పవర్ జూలై, 09 :** ఈ నెల 10న గురువారం జిల్లా వ్యాప్తంగా జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములై విద్యార్థిని, విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన చర్చలో తప్పనిసరిగా పాల్గొని విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1336 ప్రభుత్వ పాఠశాలలు, 619 ప్రైవేటు పాఠశాలలు, 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కెజిబివిలో ఉన్న 27 జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్ లో ఉన్న 20 జూనియర్ కళాశాలలతో పాటు, గిరిజన, సాంఘిక, బిసి వసతి గృహాల జూనియర్ కళాశాలతో పాటు జిల్లాలో ఉన్న 66 ప్రైవేటు కళాశాలలో కూడా ఈ నెల 10న ఉదయం 9 గంటల నుంచి మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఖచ్చితంగా భాగస్వామ్యులు కావాలని తద్వారా తమ పిల్లలను వారు ఏ స్థాయిలో చూడాలనుకుంటున్నారు, అందుకు ఉపాధ్యాయులు వారిని ఏ విధంగా తీర్చిదిద్దాలనే విషయాలపై తగు సూచనలు ఇవ్వాలన్నారు. అదే విధంగా పిల్లలందరికీ గత సంవత్సరంతో సాధించిన ఫలితాల ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు, హెల్త్ కు సంబంధించిన రిపోర్టుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం ఎంత మేరకు జమ అయ్యిందనే వివరాలను ప్రోగ్రెస్ రిపోర్టులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. సమావేశంలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులలో సమావేశమై వారి విద్యా పురోగతి గురించి వివరిస్తూ, క్రీడలు, పాఠశాల అభివృద్ధి పై తల్లిదండ్రులకు వివరించి అందుకు తగిన వీడియోలు ప్రదర్శించడంతో పాటు, ఆటల పోటీలు కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ వర్క్ షాప్ సదస్సుకు జిల్లా కలెక్టర్

### సదస్సులో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్




**వైయస్సార్ కడప పెన్ పవర్ జులై 9 :** న్యూఢిల్లీలో మంగళవారం ఒక రోజు జరిగిన నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ వర్క్ షాప్ సదస్సుకు వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌ. కేంద్ర గనులు మరియు పర్యాటక శాఖ మంత్రిని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి కలిశారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ కార్యకలాపాలు, జిల్లాలోని అభివృద్ధి పనులు గురించి ఆయనకు వివరించారు. అలాగే గండికోట ప్రాజెక్టులో జరుగుతున్న పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి గురించి మంత్రికి తెలియజేశారు.


# నేడు పెన్ పవర్ నూతన కార్యాలయం కడపలో ప్రారంభం





**కడప, పెన్ పవర్ జులై 09 :** కడప నగరం గాంధీ నగర్ పాఠశాల ఎదురుగా పెన్ పవర్ నూతన కార్యాలయం ప్రారంభం జరుగుతుందని రాయలసీమ కోఆర్డినేటర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, సయ్యద్ ఇక్బాల్ బాషా, కేశవ బాబు జీవి తెలిపారు. మా నూతన కార్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా మీ కుటుంబసభ్యులు కందరికీ.. మా సాదర ఆహ్వానం తెలియజేస్తున్నామన్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.





ఇట్లు..

సయ్యద్ ఇక్బాల్ బాషా, బి. ఎ, బిజినెస్ సెక్టార్. జీవి. కేశవ బాబు ఎంబీఏ. ఆల్ టైప్స్ ఆఫ్ బ్యాంకింగ్ లోన్స్.

సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి. ఎం.ఏ, బిఈడి, పెన్ పవర్ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్. కృషి ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా.

# బ్యాంకింగ్ రంగంలో యువతకు విస్తృత అవకాశాలు

## వైవీయూలో ఎస్బిఐ పిఓ ఉద్యోగాలపై అవగాహన



**కడప పెన్ పవర్ జులై 9 :** బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వ ఉద్యోగంతో కెరీర్‌ను ప్రారంభించాలనుకునే యువతకు పిఓ పోస్టులు అద్భుత అవకాశాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ) వచ్చిందని రీజినల్ మేనేజర్ నుతన్ కుమార్ అన్నారు. యోగి వేమన యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ శాఖ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, వైవీయూ ఎస్బిఐ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు పీఓ ఉద్యోగ నియామకాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ నూతన్ కుమార్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసీ లేదా ఫైనల్ ఇయర్‌లో ఉన్న యువత ఎస్బిఐ పిఓ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు ఉజ్వల భవిష్యత్తుకు మార్గాలని వివరించారు. ఎస్బీఐ నుంచి ఇటీవల పీఓ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైందని, దరఖాస్తు విధానం, సన్నద్ధత, ఉద్యోగ సాధన మెలకువలు గురించి అవగాహన కల్పించారు. అర్హతలు, నెల వారి వేతనం , భవిష్యత్తులో ఆ శాఖలో చేరుకునే స్థాయి గురించి తెలిపారు. ఎస్బిఐ రీజినల్ బ్రాంచీ హెచ్ఆర్ మేనేజర్ ఆర్.సైకుమార్, పీఓ ఉద్యోగానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎస్బిఐలో పీఓ ఉద్యోగం పొందడానికి సిలబస్, ప్రిపరేషన్ మాడ్యూల్ గురించి వివరించారు. బ్యాంక్ అధికారులు విశ్వవిద్యాలయానికి వచ్చి ఎంబీఏ విద్యార్థులకు బ్యాంకు ఉద్యోగాలపై అవగాహన కల్పించినందుకు ఎంబీఏ శాఖ విభాగాధిపతి డాక్టర్ పి సరిత కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎస్బిఐ వైవీయూ బ్రాంచీ మేనేజర్ కె.శ్వేత, ఎస్ఎంబి బ్రాంచీ నుంచి ముకుంద్, ఆర్బిఓ, కడప నుంచి పి.నాగేంద్ర లైవ్ ఉదాహరణలతో విద్యార్థులో ప్రేరణ నింపారు. ఈ కార్యక్రమంలో ఎంబిఏ ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి వర్క్ షాప్ నందు పాల్గొన్న వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి





**వైఎస్ఆర్ కడప, పెన్ పవర్ జూలై 09 :** న్యూఢిల్లీ నందు బుధవారం భారత ప్రభుత్వ బొగ్గు మరియు ఖనిజ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో జిల్లా ఖనిజ క్షేత్ర నిధి సంస్థల నిర్వహణపై జాతీయస్థాయిలో జరిగిన వర్క్ షాప్ నందు పాల్గొన్న వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి. ఈ వర్క్షాపు నందు కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి, భారత ప్రభుత్వ ఖనిజ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డిఎల్ కాంతారావు,వివిధ రాష్ట్రాల జిల్లా కలెక్టర్లు మరియ గనులు మరియు భూగర్భ శాఖ అధికారులు పాల్గొనడం జరిగింది. ఈ వర్క్ షాపు యందు ప్రధానంగా చర్చించబడిన నాలుగు అంశాలో ఒక్కటైనా జిల్లా ఖనిజ క్షేత్ర నిధి సంస్థల నిర్వహణకై ప్రణాళిక మరియు అమలు అనే అంశం పై నియమించిన కమిటి లో జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఇతర రాష్ట్రాల కలెక్టర్ లు ఇచ్చిన ప్రజెంటేషన్ అంశాలకు ఈ వర్క్ షాపు నందు పాల్గొన్న సభ్యుల నుండి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా భారత బొగ్గు మరియు గనుల మంత్రిత్వశాఖ వారు వై ఎస్ ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరిని జ్ఞాపికతో సత్కరించడం జరిగింది

## దేశంలో ప్రముఖ డేటా సెంటర్స్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో..



**అమరావతి పెన్ పవర్ జూలై 9 :** మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన CtrlS డేటా సెంటర్ సంస్థ ప్రతినిధులు నేడు సచివాలయంలోని ఆర్&బీ కార్యాలయంలో రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన CtrlS డేటా సెంటర్ సంస్థ ప్రతినిధులు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని తన ఛాంబర్ లో కలిసి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబర్చిన.. దేశంలో ప్రముఖ డేటా సెంటర్లలో ఒకటైన CtrlS డేటా సెంటర్ సంస్థ ప్రతినిధులు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన CtrlS డేటా సెంటర్ సంస్థ ప్రతినిధులు

## ఎస్సీ హాస్టల్స్ పరిశీలన





**అనంతపురం పెన్ పవర్ జూలై 9 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాల మేరకు, అనంతపురము జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి E.భీమారావు గారు ఆదేశాలతో ఈరోజు అనగా 09-07-2025 వ తేదిన S.C. కాలేజీ హాస్టల్, S.C. బాలికల హాస్టల్ మరియు B.C. బాలికల హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. వారికీ అందుతున్న వసతులు, సేవలు గురుంచి విచారించారు. వంట గదులును పరిశీలించారు. జిల్లా న్యాయ సేవ అదికార సంస్థ సేవలు, 1098 చైల్డ్ హెల్ప్ లైన్ గురుంచి జిల్లా న్యాయ సేవ అదికార సంస్థ , అనంతపురం కార్యదర్శి N.రాజశేఖర్ విద్యార్థులకు వివరించారు. హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

## “శిక్షణ పొందిన మధ్యవర్తులకు (న్యాయవాదులు) ఒక రోజు వర్క్‌షాప్/ఓరియంటేషన్ కార్యక్రమం”






**కడప పెన్ పవర్ జూలై 9 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి మరియు మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ ఆదేశానుసారంగా ఎల్.వెంకటేశ్వరరావు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఇంచార్జ్ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి సూచనల మేరకు, గౌరవ శ్రీమతి కె.ప్రత్యూష కుమారి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, ఇంచార్జ్ సెక్రటరీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు న్యాయ సేవా సదన్ కడప నందు “శిక్షణ పొందిన మధ్యవర్తులకు (న్యాయవాదులు) ఒక రోజు వర్క్‌షాప్/ ఓరియంటేషన్ కార్యక్రమం” నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ ట్రైనర్‌లు మాట్లాడుతూ మధ్యవర్తిత్వ ప్రతిష్టంభనలు మరియు రాజీ ఒప్పందాలను అధిగమించడం, ఆధునిక మధ్య వర్తిత్వ సవాళ్లను నావిగేట్ చేయడం, ప్రతిష్టంభన రకాలు, కేస్ స్టడీస్, గ్రూప్ యాక్టివిటీ, అధునాతన సాధనాలు, రోల్ ప్లే ఫెసిలిటేటర్లు, చట్టబద్ధంగా మంచి ఒప్పందాల నిర్మాణం అస్పష్టమైన భాషా ఆపదలను నివారించడం, నమూనా ఒప్పందాలను రూపొందించడం, బహుళ పార్టీ సాంస్కృతిక ఒప్పంద వ్యూహాలు, తరగతులను అనుకూలీకరించడం, పీర్ సమీక్ష మరియు అభిప్రాయ సెషన్ మొదలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మిస్ అనూష సక్సేనా, అడ్వకేట్ కం సీనియర్ ట్రైనర్ న్యూఢిల్లీ, మిస్ మీనా కేర్ అడ్వకేట్ కం సోషల్ వర్కర్ కం సీనియర్ ట్రైనర్ మధ్యప్రదేశ్ శిక్షణ పొందిన మధ్యవర్తులు (న్యాయవాదులు) పాల్గొన్నారు.

## సూపర్ పాలన తొలి అడుగు.. ఇంటింటికి తెలుగుదేశం పార్టీ : కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి







**కమలాపురం పెన్ పవర్ జూలై 9 :** కమలాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే చైతన్య రెడ్డి. సూపరిపాలన...తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో కమలాపురం శాసనసభ్యులు పుత్తా చైతన్య రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి - వారికీ చంద్రబాబు పాలనలో - సూపర్ సిక్స్ పథకాలు - పెన్షన్ - ఉచిత గ్యాస్ - తల్లికి వందనం - అన్నా క్యాంటిన్ - చెత్తపన్ను - ఇంకా మ్యాని పోస్టు లోని అమలు చేసిన సంక్షేమం వివరిస్తూ - అమలు చేయబోతున్న - అన్నదాత సుఖీభవ - అగస్ట్ 15 మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం - ఇంట్లో ఎంత మంది మహిళలకు - 18 సం రాల వయసు నుండి 59 సంవత్సరాల వారికీ నెలకు 1500 రూపాయల పదకాలు వివరించారు. ఆకుటుంభంతో గత పాలన నేటి పాలనలో వ్యత్యాసం అడిగి తెలుసుకున్నారు. పథకాలు రాని కుటుంబాలకు అక్కడే అధికారులను పిలచి పరిష్కారం చేయించారు. పరిష్కారం కానివి ఎలా చేస్తే పరిష్కారం అవుతాయి ,అనే విధంగా అధికారులను ఆదేశించి ముందుకు సాగిన కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి

## జూలై 16న శ్రీవారి ఆలయంలో అణివార ఆస్థానం, 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల పెన్ పవర్ జూలై 9 :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. జూలై 16వ తేదీన ఆణివార ఆస్థానం సందర్భంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే తిరుమంజనం కార్యక్రమం సుమారు 5 గంటలపాటు కొనసాగనుంది. తిరుమంజనం కార్యక్రమం అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. తిరుమంజనం కారణంగా మంగళవారంనాడు నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

**జూలై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం :**

తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా జరుగనుంది.

**చారిత్రక నేపథ్యం :**

సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుండి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి-ఏప్రిల్ నెలలకు మార్చారు.

**ఉత్సవ విశిష్టత :**

ఈ ఉత్సవం రోజున ఉదయం 7 గంటలకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

**జీయ్యంగార్ల వస్త్ర సమర్పణ :**

తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగింటిని మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామివారికి, మరొకటి విష్వక్సేనుల వారికి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాద వస్త్రంతో "పరివట్టం"(చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యర్ స్వామివారికి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయ్యర్ స్వామివారికి, టీటీడీ తరపున కార్యనిర్వహణాధికారికి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచుతారు.

**పుష్ప పల్లకీపై ఊరేగింపు :**

ఆణివార ఆస్థానం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై తిరుమల పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు.

**ఆర్జితసేవలు రద్దు :**

ఆణివార ఆస్థానం కారణంగా జూలై 16న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

**విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు**

జూలై 15 మరియు జూలై 16 తారీఖుల్లో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం మరియు ఆణివార ఆస్థానం ఉన్న కారణంగా ఈ రెండు రోజుల్లో విఐపి బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా వీఐపీ బ్రేక్ దర్శనానికి సంబంధించిన సిఫార్సు లేఖలు జూలై 14 మరియు జూలై 15 తారీఖుల్లో స్వీకరించబడవు. భక్తులు ఈ అంశాలను గమనించి టిటిడి కి సహకరించవలసిందిగా కోరడమైనది

## మానసిక, శారీకరక ఎదుగుదల లేని పిల్లలకు అత్యాధునిక వైద్య సదుపాయం

### మానసిక, శారీరక ఎదుగుదల లేని పిల్లలకు పిల్లల వైద్య నిపుణులతో పాటు, స్పీచ్ థెరపిస్ట్, ఈ ఎన్ టి స్పెషలిస్ట్, ఫిజియోథెరపిస్ట్ లతో వైద్య సేవలు : జిల్లా కలెక్టర్





**చిత్తూరు, పెన్ పవర్ జూలై 09 :** చిన్నపిల్లలలో వైకల్యం ను తగ్గించడానికి త్వరిత గుర్తింపు మరియు త్వరిత చికిత్స కల్పించడమే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ లక్ష్యమని చిత్తూరు ఎం పి డా. దగ్గుమళ్ళ ప్రసాద్ రావు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రి నందు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రమును 178.21 లక్షల రూపాయలతో NHM గ్రాంట్ నిధులతో చిత్తూరు పార్లమెంట్ సభ్యులు డా. దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో భాగంగా రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమ్ వాహనం ను ముఖ్య అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం పి మాట్లాడుతూ డిఈఐసి కేంద్రం RBSK రాష్ట్ర బాల ఆరోగ్య స్వస్థ కార్యక్రమం కింద NHM జాతీయ ఆరోగ్య మిషన్ పరిపాలనలో పనిచేస్తుందని, చిన్నపిల్లలలో వైకల్యం తగ్గించడానికి త్వరిత గుర్తింపు మరియు త్వరిత చికిత్స కల్పించడమే ఈ కేంద్రం లక్ష్యం అని అన్నారు. ఈ కేంద్రం నాలుగు రకాల లోపాలపై 4ds ప్రధానంగా పనిచేస్తుంది. ఇందులో పుట్టుక సమయంలో లోపాలు, అభివృద్ధి లోపాలు, వ్యాధుల ద్వారా వచ్చే లోపాలు, పౌష్టికాహార లోపాలు మొత్తం 30 ఆరోగ్య సమస్యలు ఎంపిక చేయబడి స్క్రీనింగ్, త్వరిత గుర్తింపు మరియు ఉచిత చికిత్సకు లోబడి పని చేస్తాయన్నారు. 0-6 సంవత్సరాల పిల్లల నిర్వహణ ప్రత్యేకంగా డిఈఐసి స్థాయిలో జరుగుతుందని, 6-18 సంవత్సరాల పిల్లలు పరిస్థితులు స్థానిక ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కేంద్రం లో చిన్నపిల్లల వైద్య నిపుణులు, దంత వైద్యులు, శ్రవణ, వాక్కు చికిత్స నిపుణులు, శారీరక థెరఫీ నిపుణులు, కంటి నిపుణులు, క్లినికల్ సైకాలజిస్ట్, మొదలగు స్పెషలైజేషన్ వారు ఇందులో పనిచేస్తారని, ఈ అవకాశాన్ని అవసరమైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన వైద్యశాల ప్రాంగణంలో రూ.178.21 లక్షలతో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (జిల్లా బాలల ముందస్తు చికిత్స కేంద్రం) ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పుట్టిన పిల్లల్లో దాదాపు 5 శాతం మంది పిల్లలు నడవలేక పోవడం, మాట్లాడ లేకపోవడం, మానసిక, శారీరక ఎదుగుదల లేకపోవడం, తదితర లోపాలు ఉన్నాయని, వారికి థెరపీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కేంద్రంలో చిన్న పిల్లల వైద్య నిపుణులతో పాటు, స్పీచ్ థెరపిస్ట్, ఈ ఎన్ టి స్పెషలిస్ట్, ఫిజియోథెరపిస్ట్ లు అందుబాటులో ఉంటారని, అవసరం ఉన్న వారు సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. సాధారణంగా 3సం.ల నుండి 6 సం.ల వయసు లోపు పిల్లలకు ఇటువంటి లోపాలు ప్రారంభమవుతాయని, వాటిని సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. జిల్లాలో సుదూర ప్రాంతాల నుండి జిల్లా ప్రధాన వైద్యశాలకు రావడం ఇబ్బందికారంగా ఉంటుందన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గానికి ఒక డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. దీనితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా కూడా ఈ వైద్య సేవలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పిల్లలకు వారు పుట్టిన ఆసుపత్రిలో వైద్యాధికారులు, నర్సులు మరియు ఏఎన్ఎం ల ద్వారా మొదటి స్థాయి స్క్రీనింగ్ జరుగుతుందని, 48 గంటల తర్వాత ఆరు వారాల వరకు ఆశ వాలంటీర్లు ఇంట్లోనే స్క్రీనింగ్ చేస్తారన్నారు. 6 వారాల నుంచి ఆరు సంవత్సరాల వరకు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో, 6-18 సంవత్సరాల పిల్లలను పాఠశాలల్లో పీహెచ్సీ/ యుహెచ్సి వైద్యులు స్క్రీనింగ్ చేస్తారన్నారు. లోపాలు గుర్తించిన పిల్లలకు డిఈఐసి సెంటర్ ద్వారా ఉచితంగా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం చిత్తూరు లోని డిఐసి కేంద్రం నుంచి 50 మంది పిల్లలకు వైద్యం అందించబడుతుందని తెలిపారు. చిత్తూరు ఎంఎల్ఏ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ప్రధాన వైద్యశాల ప్రాంగణంలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం ఒక శుభ పరిణామమని, ఈ సేవా కేంద్రంలో మానసిక, శారీకరక ఎదుగుదల లేని పిల్లలకు అత్యాధునిక వైద్య సదుపాయాలను అందించడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పురపాలక మేయర్ అముద, చుడా చైర్మన్ కటారి హేమలత, డి ఎం అండ్ హెచ్ ఓ డా. సుధారాణి, డాక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మెగా పిటిఎం 2.0కు పూర్తయిన ఏర్పాట్లు

**వైయస్సార్ కడప పెన్ పవర్ జులై 9 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ఈ నెల 10న నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహణకు విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అన్ని ఏర్పాట్లు పురయ్యాయి. జిల్లాలోనీ అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు సుందరంగా ముస్తాబయ్యాయి. బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాల ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రతి పాఠశాల కళాశాల నుండి 2 నిమిషాలు వీడియోగ్రాఫీ రెండు ఫోటోగ్రాఫ్ లను అప్లోడ్ చేశారు. ఆయా పాఠశాలల్లో కళాశాలలో ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, ప్రముఖులు,మేధావులు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 2821 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 2.91 లక్షల మంది విద్యార్థులు 13,000 మంది టీచర్లు,152 ప్రభుత్వ,ప్రవేటు కళాశాలలో దాదాపు 32వేలు మంది విద్యార్థులు, 1600 మంది అధ్యాపకులతో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ లు పండుగ వాతావరణం జరగనున్నాయి.

మెగా పిటిఎం 2.0 ముఖ్యమైన కార్యక్రమాలు :

ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులకు సమగ్ర పురోగతి కార్డులను( హోలిస్టిక్ రిపోర్టు కార్డు) అందిస్తారు. తల్లికి వందనం కాంపిటీషన్లలో బెస్ట్ పర్ఫామెన్స్ చేసిన విద్యార్థులకు ప్రశంసలు అందజేస్తారు. విద్యార్థులు అమ్మ పేరు మీద మొక్కలు నాటుతారు. విద్యార్థులు తల్లికి పాదాభివందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి తమ మనోభావాలను వెల్లడిస్తారు.

## కడప జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు

ఎన్జీవో చైర్మన్ జూటూరు






**కడప పెన్ పవర్ జూలై 9 :** కడప జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జూలై 10 నుండి జూలై 16 వరకు కడప జిల్లా వ్యాప్తంగా కడప, సీకే దిన్నె, మైదుకూరు,కమలాపురం, ఎర్రగుంట్ల, వేంపల్లి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, దువ్వూరు మరియు ఖాజీపేట ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో ఉన్న వారు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయగలరని కోరుకుంటున్నాము. అలాగే మీ ప్రాంతంలో బ్లడ్ క్యాంప్ నిర్వహించే ఆలోచన ఉంటే మాకు కాల్ చేయగలరు.

## జీవితంలో పరిష్కారం లేని సమస్య ఏదైనా ఉందా?

### పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి



**కడప పెన్ పవర్ జులై 9 :** తెలివైన పక్షి.. ఒకప్పుడు ఆకాశంలో ఒక పక్షి ఎగురుతూ ఉంది. దారిలో దానికి ఒక గ్రద్ద కలిసింది. గ్రద్ద ఆ పక్షిని తినడానికి వెంటపడింది. పక్షి తనను వదిలిపెట్టమని, ప్రాణం కోసం గ్రద్దని వేడుకుంది, కానీ గ్రద్ద దయ చూపడానికి సిద్ధపడలేదు. అప్పుడు పక్షి గ్రద్దని ఇలా వేడుకుంది, "నాకు చిన్న పిల్లలు ఉన్నారు. వాటిని పెంచడానికి నేను జీవించి ఉండాలి." అప్పుడు గ్రద్ద పక్షికి ఒక షరతు పెట్టింది: "నాతో పోటీ పడు, నన్ను నువ్వు ఓడిస్తే, నీ ప్రాణాలను విడిచిపెడతాను, నిన్ను వదిలేస్తాను." పందెంలో తనను ఓడించడం పక్షికి అసాధ్యమని గ్రద్దకు తెలుసు అందుకే అంత కష్టమైన షరతు పెట్టింది. ఈ పందానికి ఒప్పుకోవడం తప్ప పక్షికి మరో మార్గం లేదు. పందెంలో గ్రద్దను ఓడించడం అసాధ్యమని పక్షికి తెలుసు, అయినప్పటికీ పందానికి ఒప్పుకుంది. కానీ పందెం ముగిసే వరకు తనను చంపకూడదని గ్రద్దకు షరతు పెట్టింది. గ్రద్ద దానికి అంగీకరించింది. పందెం ప్రారంభమైంది. వెంటనే పక్షి, గ్రద్ద తలపైకి ఎక్కి అక్కడ కూర్చుంది. గ్రద్ద పందెం చివరికి చేరుకున్న వెంటనే, పక్షి గబుక్కున ఎగురుకుంటూ ముగింపు రేఖ దాటి పందెం గెలిచింది. పక్షి తెలివికి గ్రద్ద ముగ్ధుడై పక్షిని వదిలేసింది. పక్షి వెంటనే తిరిగి దాని గూటికి అది ఎగిరిపోయింది. ఎదురుగా బలమైన ప్రత్యర్థి ఉన్నా ఆ చిన్న పక్షి ప్రయత్నించడం వదిలేయలేదు. పరిస్థితిని చూసి బాధపడుతూ ఉండకుండా ఓర్పుతో, తెలివిగా సమస్యకు పరిష్కారం కనిపెట్టింది. క్లిష్ట పరిస్థితులకు సరైన పరిష్కారాన్ని కనుగొనడం ఖచ్చితంగా సాధ్యమే. ఉండాల్సిందల్లా మన మీద మనకు నమ్మకం. హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం ఉద్దేశ్యం ఏమిటంటే, మనస్సును క్రమబద్ధీకరించడం ద్వారా, జీవితంలోని అత్యంత విపత్కర పరిస్థితుల్లో కూడా, మనం కాసేపు ఆగి, విశ్లేషించి సరైన చర్య తీసుకునే విధంగా స్థిరత్వానికి తీసుకురావడమే.

**దాజీజి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**

## మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజాసేవకు ఒక సంవత్సరం

### ధర్మవరం పట్టణంలో మూడు రోజుల పాదయాత్ర : నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు





**ధర్మవరం పెన్ పవర్ జూలై 09 :** ధర్మవరం పట్టణంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ మూడు రోజుల పాదయాత్ర చేపడుతున్నట్లు మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు పేర్కొన్నారు. 2024 జూన్ 4న ధర్మవరం శాసనసభ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధించి, ఆపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సత్యకుమార్ యాదవ్ పాలనకు ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా, మంత్రి ప్రజల మధ్య నడుస్తూ, ప్రతి గుండెను తడుతూ, ప్రతి సమస్యను వింటూ మూడు రోజుల పాదయాత్ర నిర్వహించబోతున్నారని మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. హరీష్ బాబు వివరణ ప్రకారం, ఈ పాదయాత్ర జూలై 11వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు తిక్కస్వామి నగర్‌లోని శివాలయం వద్ద నుంచి ప్రారంభమవుతుంది. శుక్రవారం, శనివారం, ఆదివారయిమూడు రోజుల పాటు పట్టణంలోని పలు వార్డుల్లో మంత్రి స్వయంగా పాదయాత్ర చేస్తూ ప్రజలను కలిసి, వారి అభిప్రాయాలను స్వీకరిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్టులు, అలాగే రాబోయే ప్రణాళికలపై ప్రజలకు వివరాలు అందజేయనున్నారని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడమే ఈ పాదయాత్ర లక్ష్యమని చెప్పారు.

ఈ సందర్భంగా సందర్శించబోయే వార్డులు:

7వ వార్డు, 6వ వార్డు శివనగర్ (పబ్లిక్ హెల్త్ సెంటర్ – కదిరి సెంటర్), 17వ వార్డు సంజయ్ నగర్, 18వ వార్డు గాంధీ నగర్ (రాఘవేంద్ర స్వామి ఆలయం),19వ వార్డు ఇందిరానగర్, 20వ వార్డు పిఆర్‌టి వీధి, 22వ వార్డు సాయి నగర్ (పోలీస్ స్టేషన్), 21వ వార్డు సిద్ధయ్య గుట్ట, 24వ వార్డు జోగోనికుంట, 36వ వార్డు లక్ష్మీనగర్ (అండర్ పాసేజ్),

38వ వార్డు కొత్తపేట, 39వ వార్డు రాంనగర్,

37వ వార్డు టీచర్స్ కాలనీ (వెంకటేశ్వర స్వామి ఆలయం),

35వ వార్డు బాలాజీ నగర్, 34వ వార్డు రాజేంద్ర నగర్,

8వ వార్డు కేశవనగర్, 9వ వార్డు లింగసెట్టి పాలెం,

8వ వార్డు బోయా వీధి మొదలైన ప్రాంతాలు.

ధర్మవరం అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమైందన్న విశ్వాసంతో ప్రతి వీధిని, ప్రతి ఇంటిని తన సొంతంగా భావిస్తూ మంత్రి ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకోనున్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలందరినీ ఆహ్వానిస్తున్నామని, మీ సమస్యను నేరుగా మంత్రివారికి తెలియజేసే ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని హరీష్ బాబు కోరారు.

## మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన హరిబన్ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు



**అమరావతి పెన్ పవర్ జూలై 9 :** నేడు సచివాలయంలోని ఆర్&బీ కార్యాలయంలో రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదు పాయాలు, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హరి బన్ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని తన ఛాంబర్ లో కలిసి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబర్చిన.. రాడార్, జిపిఎస్ పరికరాలు, శోధన, గుర్తింపు నావిగేషన్ వ్యవస్థలతో సహా వివిధ వైమానిక మరియు నాటికల్ పరికరాల తయారీ సంస్థ హరిబన్ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు. రక్షణ, వ్యవసాయ రంగాల్లో, నీటి నాణ్యతా ప్రమాణాలు, పోర్టుల భద్రతపై నిరంతర నిఘా వంటి అంశాల్లో సేవలు అందించనున్న హరిబన్ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్.

## న్యాయమూర్తులతో ముఖాముఖి..!



**కర్నూలు పెన్ పవర్ జూలై 9 :** ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వ రిసోర్స్ పర్సన్స్ అనుజ సక్సెన, నీనా కరే లతో న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వంపై చర్చించారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి పాల్గొన్నారు.


## "హిట్ అండ్ రన్ కేసులపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్"




**కర్నూలు పెన్ పవర్ జూలై 9 :** సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు బి. లీలా వెంకట శేషాద్రి న్యాయ సేవా సదన్ నందు "హిట్ అండ్ రన్ కేసులపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్" నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కర్నూల్&నంద్యాల డిస్ట్రిక్ట్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, నంద్యాల డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్, కర్నూల్ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, కర్నూల్ రీజినల్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్, నంద్యాల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, డోన్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్,కర్నూల్ కలెక్టర్ ఆఫీస్ సూపరింటెండెంట్ మొదలగువారు పాల్గొన్నారు.


## మానవతా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు

### రాటాల గోపి సెంట్రల్ కమిటీ డైరెక్టర్







కడప పెన్ పవర్ జూలై 9 : కడప నగర మానవత సంస్థ డాక్టర్ పీకే అండ్ సీఎం జూనియర్ కళాశాలలో నైతిక విలువల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. టీనేజ్లో ఉండే ఇంటర్మీడియట్ విద్యార్థులు తల్లిదండ్రులు,అధ్యాపకులు చెప్పేటువంటి నైతికవిలువలను సరైన రీతిలోఅర్థం చేసుకొని మంచివైపు పయనిస్తే అది వారి జీవితంతో పాటు సమాజాన్ని కూడా మార్చి వేస్తుందని, శాంతి జీవనానికి బాటలు వేస్తుందని సెంట్రల్ కమిటీ డైరెక్టర్ మరియు జిల్లా కెరీర్ గైడెన్స్ చైర్మన్ రాటాల గోపి వివరించారు. శ్రీ మనోహర్, రిటైర్డ్ పీడీ మాట్లాడుతూ మానవతా సంస్థ అందించే కార్యక్రమాలను అందరూ తెలుసుకుని వాటిని ఉపయోగించుకోవాలని వివరించారు. సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ డైరెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మించిన ప్రవర్తన మరొకటి ఏదీ లేదని అది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని వివరించారు. విద్యార్థులకు ప్రథమ,ద్వితీయ, తృతీయ మరియు ఫూర్ అండ్ మెరిట్లకు 1000, 800, 500, 500 రూపాయల చొప్పున క్యాష్ బహుమతి ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు,విద్యార్థులు అందరూ ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యానికి మానవత సంస్థ తరఫున ధన్యవాదాలు తెలియజేయుచున్నాము.

## తిరుపతి పట్టణ సమగ్రాభివృద్ధికి సాంకేతిక, పర్యవేక్షణ సహకారం అందిస్తాం

### కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల



తిరుపతి, పెన్ పవర్ జూలై 09 : తిరుపతి పట్టణ సమగ్రాభివృద్ధికి సాంకేతిక మరియు పర్యవేక్షణ సహకారం అందిస్తామని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు తిరుపతి పట్టణ సమగ్రాభివృద్ధిపై స్టేక్‌హోల్డర్లతో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ఆ శాఖ సంయుక్త కార్యదర్శి (అమృత్ పథకం) ఇషా కాలియా, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్ , తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఎన్.మౌర్యతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించి సంబందిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల మాట్లాడుతూ..... జనాభాల అవసరాల ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలన్నారు. జనసాంద్రత ఆధారంగా మౌలిక సదుపాయాల రూపకల్పన జరగాలని, నగరాల విస్తరణకు బదులుగా అందులోని ఖాళీ భూములను వినియోగించి తద్వారా ఎక్కువ మందికి సేవలందించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఇదే అభివృద్ధికి సమర్థవంతమైన మార్గమని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. విస్తృత ఆర్థిక జోన్ అభివృద్ధి ద్వారా తిరుపతి ప్రాంతానికి కొత్త రూపురేఖలను తీసుకురావాలన్నదే లక్ష్యం అన్నారు. పర్యాటకాన్ని కేవలం దర్శనానికే పరిమితి కాకుండా ఈ ప్రాంతంలో రాత్రి వసతితో కూడిన ప్యాకేజీలుగా మార్చడం ద్వారా వ్యాపార వృద్ధికి దోహదపడుతుందన్నారు. పెట్టుబడులను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉపయోగించి వృద్ధి అవకాశాలను అధికంగా పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని ఇందుకు విజయవాడలోని కాళేశ్వర్ రావు మార్కెట్ లాంటి వ్యాపార కేంద్రాలను ఉదహరించారు.దీనితో పాటుగా హైదరాబాద్‌లోని బేగం బజార్ లాంటి మార్కెట్లు వందల కోట్ల వ్యాపారం చేస్తాయని, ఈ తరహా క్లస్టర్లను ఇతర నగరాల్లో కూడా గుర్తించి అభివృద్ధి చేయడం ద్వారా విస్తృత ఆర్థిక ప్రభావం చూపవచ్చున్నారు. భారతదేశంలో పెళ్లిళ్ల పరిశ్రమ విలువ సుమారు లక్ష కోట్లని , తిరుమలలో పెళ్లిళ్లకు వచ్చే వారికి వారి అవసరాలకు తగిన విధంగా సదుపాయాలు లేకపోవడం వల్ల ఈ అవకాశాన్ని వినియోగించుకోలేక పోతున్నామన్నారు. ఇందుకోసం తిరుపతిని డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు మానవుని సాగటు జీవిత కాలం పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం భారత దేశం యవ్వనంగా ఉన్నా, త్వరిత గతంగా వృద్ధాప్య దశలోకి అడుగు పెడుతోందన్నారు. ఇలాంటి సందర్భాల్లో వృద్ధులకు సేవలు అందించడం కోసం సహాయక జీవన కేంద్రాలను వైద్య సదుపాయాలతో కలిపి అభివృద్ధి చేయాలన్నారు. 1995–96 సంవత్సర కాలంలో తానూ గుజరాత్‌లో పని చేస్తున్నానని అప్పటి పరిస్థితిని గుర్తుచేసుకుంటే గుజరాత్‌లో ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని ఎలా ఉపయోగించుకోవాలి అనే దానిపై సమాలోచనలు చేశామన్నారు. దృష్టికోణం మారితే అవకాశాలే మారుతాయని, తీర ప్రాంత అభివృద్ధిపై ఒక స్పష్టమైన ప్రణాళిక రూపొందించామన్నారు. అప్పుడు తమ వద్ద 41 ఫిషింగ్ పోర్టులు (మత్స్యకారుల నౌకాశ్రయాలు) మాత్రమే ఉండేవని, కాండ్లా పోర్ట్ మినహా అన్నీ చిన్న స్థాయి పోర్టులేన్నారు. 1996లో వచ్చిన గుజరాత్ పోర్ట్ పాలసీ ప్రకారం అన్ని ఫిషింగ్ పోర్టులనూ బహు–ఉత్పత్తి పోర్టులుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి, నేడు ఒక పోర్ట్ మినహా మిగిలిన అన్ని 40 పోర్టులు మార్చబడ్డాయని ఈ విధంగా మీ ప్రాంతంలో ఉన్న పోర్టుల అభివృద్ధికి కూడా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుపతి జిల్లా భోగోళిక పరిస్థితులను వివరిస్తూ శ్రీకాళహస్తి ,తిరుపతి, సూళ్ళురుపేట, గూడూరు నాలుగు రెవెన్యూ డివిజన్లను కలిగి ఉందని, మొత్తం 34 మండలాలు, 7 పురపాలక సంఘాలలో తిరుపతి నగరపాలక సంస్థతో పాటు పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి ఉన్నాయన్నారు. మొత్తం జనాభాలో 40 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, జిల్లాలో మొత్తం జనాభాలో సుమారు 25 లక్షల మంది ఉన్నారన్నారు. తిరుపతి నగరంలోనే 4.5 లక్షల జనాభా ఉందని అన్నారు. తీర ప్రాంతమైన గూడూరు డివిజన్లో చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట డివిజన్ లో సూళ్లూరుపేట, తడ మండలాలు ఉన్నాయన్నారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మొత్తం జిల్లాని కవర్ చేస్తోందని జిల్లాలో 131 పెద్ద మరియు మెగా పరిశ్రమలు, 37,000 కోట్లు పెట్టుబడితో 75,800 మందికి పైగా ? ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇందులో శ్రీసిటీలోనే 60,000 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సూచనలకు, సలహాలకు అనుగుణంగా సంబందిత అధికారులతో సమన్వయంతో చేసుకొని తిరుపతి పట్టణ సమగ్రాభివృద్ధికి సంపూర్ణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు వైస్ చైర్మన్ మాట్లాడుతూ...తుడా మాస్టర్ ప్లాన్ తిరుపతి అర్బన్ డెవలప్ మెంట్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధి కోసం రూపొందించిన సమగ్ర ప్రణాళికను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తూ తుడా పరిధిలో సుమారు 25 లక్షల జనాభా ఉన్నారని అయితే ప్రస్తుతం 9 లక్షలు మందిని మాత్రమే కవర్ చేయడం జరిగిందన్నారు. తుడా పరిధిలో చేపట్టిన మరియు చేపడుతున్న పనుల వివరాలు గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విపులంగా వివరించారు. తిరుపతి నగరపాలక కమీషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ... తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద 83 ప్రాజెక్టులు పూర్తి కాగా, 14 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నగరంలో ప్రతి ఇంటి నుండి, వ్యాపార సముదాయాల నుండి సేకరించిన చెత్త ను తూకివాకం వద్ద గల ప్లాంట్ నందు తడి, పొడి చెత్త నిర్వహణ చేసే విధానాన్ని వివరించారు. తిరుపతి నగరంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేసి చాలా కాలం అవడం వలన ఎక్కువ ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. పలు చోట్ల పైప్ లైన్ పగిలి కుంగడం జరిగిందని తెలిపారు. మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు, వ్యవసాయానికి వినియోగిస్తున్న విధానాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. విజయవాడ డైరెక్టర్ ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ మరియు అర్కిటెక్చర్, డాక్టర్ రమేష్ శ్రీకొండ , A-CUPCB హెడ్ & SPA, విజయవాడ ప్రొఫెసర్ డాక్టర్ అయోన్ తరఫ్దార్ ఇరువురు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రాష్ట్రం మరియు తిరుపతిలో చేపట్టిన , చేపడుతున్న ప్రాజెక్టులు గురించి కేంద్ర కార్యదర్శికి వివరించారు. ఈ సమావేశంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షీ , మునిసిపల్ అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్, అసోసియేట్ ప్రొఫెసర్, SPA, విజయవాడ డాక్టర్ జనమేజోయ్ గుప్తా, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్, A-CUPCB, SPA, విజయవాడ, డాక్టర్ పవన్ తేజ, తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు గోమతి, తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ ఖాన్, తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, పి. ఓ. దేవి కుమారి, తిరుపతి పట్టనాభివృద్ధి సిబ్బంది, మునిసిపల్ కార్పోరేషన్ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది, రూరల్ మండల తహసీల్దార్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 9 :** కార్మికుల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మిక సంఘ నాయకులు, మహిళలు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా, శానిటేషన్, వీఓఏలు ఇతర కార్మికులు బుధవారం నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు జీవించే హక్కును కోల్పోయి కట్టు బానిసలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ బి. చినబాబుకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వీర వెన్నెల రాణి, మట్టపర్తి వంకటలక్ష్మి, గోసంగి పాపాయమ్మ, దేవరపల్లి స్వరూపరాణి, వల్లూరి కరుణ, ఈతకోట మేరీ ప్రమీల కుదుపూడి దుర్గలు పాల్గొన్నారు.

## ఆదర్శ భక్తుల విశ్వాసానికి జ్ఞాపకం

### - జగన్మోహిని కేశవ స్వామికి విరాళం







**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 9 :** ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామంలో, కాలగతికి ముందే అవిర్భవించిన జగన్మోహిని కేశవ గోపాల స్వామి ఆలయం భక్తుల నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం. బుధవారం జరిగిన విశిష్ట పూజా కార్యక్రమాలకు ఆలయ పరిసరాలు శుభ్రముగా, శాంతియుత వాతావరణంతో కళకళలాడాయి. స్వామివారి దర్శనార్థం స్థానికులు, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనకాపల్లి కి చెందిన దూరి శ్రీనివాస సుబ్రహ్మణ్య శాస్త్రి సతీమణి సునీత స్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రతీరోజూ జరిగే నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ. 25,000 విరాళం, హైదరాబాద్ మహానగరానికి చెందిన జి.జనార్దన్, కె.విశ్వనాథ శాస్త్రి, వి.శ్రీనివాసులు 10,116రూ, విరాళం సమర్పించడంతో వారి మనసులో ఉన్న నమ్మకాన్ని, భక్తిని స్వామివారి పాదాల వద్ద వ్యక్తీకరించారు. విరాళదాతలని ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, ఆశీర్వదించగా, ఆలయ అధికారి ఏ.శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, ఆలయ చరిత్రను తెలిపే పుస్తకం శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఆ క్షణం వారికి జీవితాంతం గుర్తుండిపోయేలా గుండెల్లో చెరగని ముద్ర వేసింది.

## కార్మికులు-రైతులు ఐక్యంగా బహిరంగ ప్రదర్శన

### ప్రజావ్యతిరేక విధానాలకు నిరసన



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 09 :** కార్మిక వర్గం తో పాటు రైతాంగం నేడు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మంగళవారం ఆచంట లో కార్మికులు, రైతులు కలిసికట్టుగా నిరసన చేపట్టారు. రామేశ్వర స్వామి సత్రం నుంచి మన్నె వారి వీధి, కాపులపాలెం, మదనగోపాల స్వామి దేవాలయం, కచేరి సెంటర్ వరకూ కార్మికులు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కచేరి సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మె సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ వైట్ల ఉమారాణి, బందే రంగారావు తెలిపారు. వ్యాపారస్తులు కూడా తమ తమ దుకాణాలను మూసివేసి సమ్మెకు మద్దతు నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. గిట్టుబాటు ధరలు లేవు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు కావడం లేదు. కార్పొరేట్లకే మద్దతు ఇస్తూ వ్యవసాయాన్ని వారి చేతుల్లోకి అప్పగిస్తోంది. బడ్జెట్లో రైతుల కోసం తగిన నిధులు కేటాయించకుండా, దోని పెట్టె పాలన సాగిస్తోందని అని విమర్శించారు. అలాగే, భవన నిర్మాణ రంగ కార్మికులు, హమాలీలు, ఆశా, అంగన్వాడీ, స్కీం వర్కర్లు పనిలో ఉన్నా ఉద్యోగ భద్రత లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను త్రొక్కేస్తోంది, కార్మిక చట్టాలను అమలు చేయాలని, కొత్తగా తేవబోయే లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌వివిఎస్ శర్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, ప్రజా సంఘాల నేతలు పి. మోహన్ రావు, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, నెక్కంటి కృష్ణమూర్తి, మన్నె బ్రహ్మయ్య, చదలవాడ చంటిబాబు, ఉన్నమట్ల పద్మారావు, వైట్ల విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, నక్క శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలి

### - శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 9 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెడుతున్న పథకాలను రైతులు సద్వినియోగపరుచుకుని వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరు చుకోవాలని రాష్ట్ర విప్ తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గేదెల పరిశోధన స్థానం, వెంకట రామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా వారి ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ ఈతకోట భీమశంకర్ రావు పాల్గొన్నారు. ముందుగా మొక్కలు నాటి గోపూజ కార్యక్రమం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు అనేక పథకాలను రైతులకు అందిస్తుందని వారు ఈ పథకాలను సద్వినియోగపరుచుకుని పదిమందికి ఉపాధి కల్పించాలని కోరారు. అందుకు గాను గేదెల పరిశోధనా స్థానం అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రవేశపెడుతున్న ప్రతి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రాయితీపై రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లు, పశువుల గొట్టం, అదేవిధంగా 10 సెంట్లు నుండి 50 సెంట్లు వరకు స్థలం ఉన్న రైతులకు పశువులు మేపు కునేందుకై సబ్సిడీ రుణాలు అందించ నున్నామని ఆయన తెలిపారు. నేడు పాడి పరిశ్రమ నష్టాల బాటలో పయనిస్తుందని పరిశ్రమను నడిపేందుకు రైతులు ఆసక్తి కోల్పోతున్నారని తద్వారా దిగుబడి కుంటుపడు తుందని అన్నారు. ఎప్పటికైనా ఒక ప్రభుత్వ ఉద్యోగానికి మించిన ఆదాయాన్ని చవి చూపించే పాడి పరిశ్రమను రైతులు ఆదరించాలని కోరారు.

రైతు అమ్మే పాలకు తగిన ధరను అందించే విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. పరిశోధనా శాల వైద్యులకు గ్రామంలో ఒక షెడ్డు ను అందుబాటులో ఉంచాలని తద్వారా వారు పశువులకు సూచించే దాన, పశుగ్రాసాలను వాడి పాల ఉత్పత్తిని పెంచుకోవాలని రైతులకు తెలిపారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఈతకోట తాతాజీ, పాలూరి వెంకటేశ్వరరావు, పైబోయిన రఘు, అడ్డగర్ల సురేష్, అడబాల నారాయణమూర్తి, రామిశెట్టి సురేష్, పైబోయిన వెంకట్రా మయ్య, అడబాల మురళి, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్ మద్దాల నరసింహ, యంత్రపాటి రాజు, చాపల రమేష్, నలగంచి రాంబాబు, మలపాక చిట్టి శ్రీ రామ్ లక్ష్మణ్ బ్రదర్స్ బైనపాలెపు ముఖేష్ అయినం బాలకృష్ణ నారగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## వై.రామవరంలో నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతం



**వై రామవరం, పెన్ పవర్ ,జూలై 9 :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వై.రామవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమ్మె విజయవంతం అయిందని మండల కార్యదర్శి కే శాంతి రాజు తెలిపారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా స్కీం వర్కర్లు పురవీధులలో నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారన్నారు. ర్యాలీ అనంతరం వై రామవరం సెంటర్లో మానవహారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ డిమాండ్ చేశారు. మోదీ సర్కార్ కార్మికులకు నష్టం కలిగించే దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని కార్మికుల హక్కులపై తీవ్రమైన దాడి చేస్తుందని మోడీ తీసుకువచ్చిన నిర్ణయాలకు వ్యతిరేకంగా బుధవారం యావత్ కార్మిక వర్గం దేశవ్యాప్తంగా సమ్మెబాట పట్టారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తుందని అన్నారు. వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, ప్రమాద భీమా, ఈఎస్ఐ,పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి మల్లికార్జునరావు, సీఐటీయూ సీనియర్ నాయకురాలు కే.బుల్లమ్మ,అంగన్వాడి, ఆశ వర్కర్స్,మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూలు శానిటేషన్ కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు వివోలు పాల్గొన్నారని తెలిపారు.




## పివిఎన్ మాధవ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా బాధ్యతలు పట్ల హర్షం





**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 9 :** రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల కేంద్రమైన కిర్లంపూడిలో హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తున్నారు. పివిఎన్ మాధవ్ కుటుంబ సన్నిహితుడు, జగపతినగరం మాజీ ఉపసర్పంచ్ తోట గోపి త్రినాథ్ ఆధ్వర్యంలో బుధవారం స్వీట్లు పంచిపట్టి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తోట గోపి త్రినాథ్ మాట్లాడుతూ పివిఎన్ మాధవ్, తండ్రి పివి చలపతిరావు వాజపేయి, ఎల్.కె.అద్వాని వంటి నాయకులతో కలసి బిజెపిలో పని చేయడమే కాకుండా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా పనిచేశారన్నారు. ఆయన కుమారుడు మాజీ ఎమ్మెల్సీ,పివిఎన్ మాధవ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడమే కాకుండా, కూటమి ప్రభుత్వంలో ఒక భాగస్వామి కావడం ఆయన కుటుంబంతో ఎంతో సన్నిహిత సంబంధం ఉన్న వ్యక్తిగా సంతోషం వ్యక్తం చేస్తున్నానన్నారు.

భవిష్యత్తులో పివిఎన్ మాధవ్ మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వీట్ లు పంచిపట్టి సంతోషం వ్యక్తం చేశారు. జగపతినగరం మాజీ ఉపసర్పంచ్ తోట గోపి త్రినాధ్, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొడేల నల్లబ్బాయి, లోక్కోజు కోటి,పోతుల శివాజీ,పాలాట్ల వాసు,పాలాట్ల గోపాలరావు, చెన్నైకి చెందిన పాలాట్ల వెంకటేశ్వరరావు, ఏలూరి వీర వెంకట రామకృష్ణ, బండారు సత్యనారాయణ, పప్పు సోమరాజు, పలువురు మాధవ్ అభిమానులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా మొహరం పండుగ

### - ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి - మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ భాష

### - కడప నగర మేయర్ కే.సురేష్ బాబు

**కడప పెన్ పవర్ జులై 9 :** కడప నగరంలోని ఇంటర్నేషనల్ కళ్యాణమండపం నందు కేసీ కెనాల్ పక్కన ఉన్న హజరత్ సయ్యద్ షేక్షావలి దర్గా నందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన కడప ఎంపీ శ్రీ వైయస్ అవినాష్ రెడ్డి గారు మాజీ డిప్యూటీ సీఎం శ్రీ అంజాద్ బాషా గారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, కడప నగర మేయర్ శ్రీ కె.సురేష్ బాబు గారు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి గారు, సీనియర్ నాయకులు సుభాన్ భాష గారు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవీ రెడ్డి ఆదిత్య. ఈ సందర్భంగా అంజాద్ భాషా మాట్లాడుతూ,.."పవిత్ర మొహరం రొట్టెల పండుగ, ఇది మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇది త్యాగానికి, ఐక్యతకు ప్రతిబింబం అని తెలిపారు. మొహరంను పురస్కరించుకొని ప్రజలందరికీ శాంతి, సుఖసమృద్ధులు కాంక్షిస్తూ అని ఆయన అభిలాష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బసవరాజు మహమ్మద్ రఫీ చాక్లెట్ గౌస్ అలీ అక్బర్ శ్రీరంజన్ రెడ్డి మల్లికార్జున రామ్ లక్ష్మణ్ రెడ్డి అజ్మతుల్లా జిలాన్ జహీర్ షంషేర్, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్ర రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, జిల్లా రైతు అధ్యక్షుడు సంగుటూరు ప్రసాద్ రెడ్డి, నాయకులు పవర్ అల్తాఫ్,జమీల్, షఫీ, రిజ్వాన్, ఇబ్రహీం మియా, చాన్ అలీ,వినోద్ కుమార్, నందలూరు ఫయాజ్,సద్దాం, ఫర్వేజ్, సమీర్, షబ్బీర్, రహమత్, అల ప్రకాష్, సలీం సాహెబ్, జాఫర్, సాయిఫ్, ఇమ్రాన్, రహీం, రఘునాథ్ రెడ్డి, జాకీర్, కరీముల్లా, బన్న, నూర్,తదితరులు ఉన్నారు.





## పటిష్టంగా కార్మిక చట్టాలను అమలు చేయాలి

### - 10 రంగాల కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశారు




**కూనవరం,పెన్ పవర్,జూలై 9 :** దేశవ్యాప్త కార్మిక సార్వత్రిక సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సుమారు 400 మందితో 10 రంగాల కార్మిక సంఘాలు కూనవరం నుండి టేకులబోరు వరకు ర్యాలీ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు.ర్యాలీ నిర్వహించిన అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి కొమరం పెంటయ్య,సీఐటీయూ జిల్లా నాయకురాలు రాజేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని అన్నారు.కార్మిక చట్టాలను పట్టిష్టంగా అమలుపరచాలని అన్నారు. కనీస వేతనం 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాల్లోనే స్కీమ్ వర్కుర్ లను,అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు.కార్మికులకు భరోసా ఉండేలా ప్రమాద భీమా కల్పించాలని డిమాండ్ చేసారు.ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటిఐ నాయకురాలు సున్నం రంగమ్మ,సిఐటియు నాయకులు పాయం సీతా రామయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మేకల నాగేశ్వరావు మడెం బాబు,రైతు సంఘం నాయకులు ఆవుల ఉపేంద్ర,మురళి,అంగన్వాడి ప్రాజెక్టు వర్కర్ అండ్ హెల్పర్ యూనియన్ లక్ష్మీ ప్రసన్న, లలిత,ఆశ వర్కర్లు సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్,రామకృష్ణ వీఆర్ఏల యూనియన్ నాయకులు కామేష్, వివో ఏ మనీ శానిటేషన్ నాయకులు దుర్గ మిడ్ డే మీల్స్ నాయకులు జ్యోతి, గ్రామపంచాయతీ సిబ్బంది శీను తదితర సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వేగుళ్ళను కలిసిన పీఏసీఎస్ చైర్మన్లు



**మండపేట. పెన్ పవర్.జూలై 9 :** మాచవరం, పసలపూడి, మండపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్లుగా నియమితులైన మేడపాటి రవీంద్రరెడ్డి, సత్తి వెంకటకృష్ణారెడ్డి, కుక్కల రామారావులు బుధవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావును బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీ కార్యాలయంలో వున్న ఆయనను వారంతా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజతలు తెలిపారు. తమపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా వారందరినీ ఎమ్మెల్యే వేగుళ్ల దుశ్శాలువాతో సత్కరించారు. మాచవరం పీఏసీఎస్ సభులుగా తిపర్తి శ్రీరమేష్, మోర్త దావీదులు, పసలపూడి సభ్యులుగా అనసూరి శ్రీనివాసరావు, బుంగ పెద్దలు నియమితులయ్యారు. మండపేట పీఏసీఎస్ సభ్యులుగా పైడిమళ్ల డేవిడ్ రాజు, పడాల జన్నయ్య కాపు (పూస )లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, రామచంద్రాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సబ్బెళ్ళ వెంకన్నబాబు, రిమ్మలపూడి సత్యనారాయణ, కొవ్వూరి ఆదిరెడ్డి, కోడి చిన్న అప్పారావు, గండి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మేము సైతం అంటూ మృతుల కుటుంబాలకు జిల్లా పోలీసుల చేయూత




**ఆలమూరు, పెన్ పవర్,జూలై 09 :** గత నెల 26న విధి నిర్వహణలో భాగంగా ఆలమూరు నుంచి హైదరాబాదు వెళుతున్న ఆలమూరు పోలీస్ స్టేషన్ ఎస్సై మద్దాల అశోక్, ఆత్రేయపురం కానిస్టేబుల్ బ్లెసన్ జీవన్ లు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఇప్పటికే 2009 ఎస్ఐల బ్యాచ్ వారి కుటుంబాలకు తోడుగా మేము ఉన్నాము అంటూ సాయం అందించి ఆదర్శంగా నిలిచి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. దీంతో స్పందించిన డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కు చెందిన అన్నీ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, సబ్ ఇన్స్పెక్టర్ లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు అందరూ కలిసి ఎస్సై మద్దాల అశోక్ కుటుంబ సభ్యులకు రూ.4 లక్షలు, బ్లెసన్ జీవన్ కుటుంబ సభ్యులకు రూ.4 లక్షలు కలిపి మొత్తం రూ.8 లక్షలు చెక్కులను, అదే విధముగా 2014 బ్యాచ్ కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్లు అదనముగా 68 వేల రూపాయల చెక్కును జిల్లా ఎస్పి బి.కృష్ణారావు చేతుల మీదుగా బుధవారం అందజేశారు.

# రాజస్థాన్ లో కుప్పకూలిన జాగ్వార్ యుద్ధ విమానం... ఏం జరిగింది?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) కు చెందిన జాగ్వార్ యుద్ధ విమానం కూలిపోయిందని తెలుస్తోంది. రాజస్థాన్ లోని చురు జిల్లాకు చెందిన భానుడా గ్రామ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుందని తెలుస్తోంది. అయితే... ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో ఒకరి మృతదేహాన్ని గుర్తించారని అంటున్నారు.అవును... రాజస్థాన్ లోని చురు జిల్లాలోని భానుడా గ్రామం సమీపంలో బుధవారం జాగ్వార్ ఫైటర్ జెట్ కూలిపోయిందని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో వైమానిక దళ పైలట్ మరణించినట్లు జాతీయ మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ విమానం సూరత్ గఢ్ వైమానిక స్థావరం నుండి బయలుదేరిన తర్వాత ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.ఈ సమయంలో సహాయక చర్యల నిమిత్తం పోలీసు బృందాలను ఘటనా స్థలానికి పంపినట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా స్పందించిన స్థానిక స్టేషన్ ఎస్.హెచ్.ఓ. కమలేష్... క్రాష్ సైట్ సమీపంలో మానవ అవశేషాలు కనుగొనబడ్డాడని.. అయితే ప్రాణనష్టానికి సంబంధించి ఐఏఎఫ్ నుండి అధికారిక ధృవీకరణ రావాల్సి ఉందని అన్నారు!కాగా... ఈ సంవత్సరం జాగ్వార్ విమానం కూలిపోవడం ఇది రెండవసారి అనే సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ లో గుజరాత్ లోని జామ్ నగర్ వైమానిక దళ స్టేషన్ సమీపంలోని శిక్షణా కార్యక్రమంలో ఐఏఎఫ్ జాగ్వార్ కూలిపోయింది. ఆ విమానం జామ్ నగర్ కు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న సువర్దా గ్రామం సమీపంలోని మైదానంలో కూలిపోయింది.ఠంఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లలో ఒకరు సురక్షితంగా బయటపడగలిగారు! ఇందులో భాగంగా.. పైలట్లలో ఒకరైన సిద్ధార్థ్ యాదవ్ తన కో-పైలట్ ను సకాలంలో బయటకు పంపించడంతో ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అయితే దురదృష్టవశాత్తు యాదవ్ సకాలంలో జెట్ నుండి బయటకు రాలేకపోయాడు.

# బీజేపీ ప్రెసిడెంట్ మాధవ్ ఫస్ట్ డిమాండ్ ఇదే..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బీజేపీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం లెనిన్ సెంటర్ లోని కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాధవ్ ఆసక్తికరమైన డిమాండ్ చేశారు. బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన చేసిన ఈ డిమాండ్ పై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సివుందని అంటున్నారు.పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం లెనిన్ సెంటర్ కు వెళ్లిన మాధవ్.. విజయవాడ లెనిన్ సెంటర్ పేరును మార్చాలని కోరారు. మన దేశానికి ఎటువంటి సంబంధం లేని లెనిన్ పేరు ప్రముఖ కూడలికి పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే మాధవ్ చేసిన డిమాండ్ పై ఆసక్తికర చర్చ జరుగుతోంది. విజయవాడలోని ప్రముఖ కూడళ్లలో లెనిన్ సెంటర్ ఒకటి. 1980ల్లో ఈ సెంటరులో లెనిన్ విగ్రహం పెట్టినప్పటి నుంచి ఆ పేరుతోనే పిలుస్తారు. పుస్తక ప్రియులకు, విద్యార్థులు, కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారికి ఈ సెంటర్ అతి ముఖ్యమైనది.విజయవాడ కార్పొరేషన్ లో కమ్యూనిస్టులు పాలించిన రోజుల్లో లెనిన్ విగ్రహం ఏర్పాటు చేశారు. దాదాపు 40 ఏళ్లుగా ఎంతో ప్రాచుర్యం పొందిన లెనిన్ సెంటర్ పేరు మార్చాలని ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదన లేదు. రష్యన్ విప్లవకారుడు, కమ్యూనిస్టు రచయితగా లెనిన్ ప్రాముఖ్యత గడించారు. మన దేశంతో ఎటువంటి సంబంధాలు లేనప్పటికీ, లెనిన్ స్ఫూర్తిని గుర్తించడానికి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 45 ఏళ్లుగా ఈ విగ్రహం నగరంలో అత్యంత ప్రజాదరణ పొందిన ల్యాండ్‌మార్క్‌లలో ఒకటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఎత్తైన వేదికపై నిలబడి ఉన్న ఈ విగ్రహాన్ని స్వచ్ఛమైన నల్ల పాలరాయితో చెక్కారు. ప్రతి సంవత్సరం మే 1వ తేదీన, కార్మిక దినోత్సవాన్ని భారీగా నిర్వహిస్తారు. ఇక ఇంతటి గుర్తింపు ఉన్న కూడలిని విశ్వనాథ సత్యనారాయణ పేరుగా మార్చాలని బీజేపీ అధ్యక్షుడు మాధవ్ డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై ప్రభుత్వం, ప్రజల నుంచి ఎలాంటి రిప్లై వస్తుందనేది చూడాల్సివుంది.

# రమ్య మర్డర్ మిస్టరీ తేలింది.. లవ్ చేసి దూరం పెట్టిందని చంపేశాడు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రేమించటం అంటే.. ప్రాణాలు తీయటమా అన్నట్లు కొందరి తీరు ఉంటోంది. తమను ప్రాణంగా ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నో చెప్పినా.. పెళ్లి వద్దకు విషయం వచ్చిన తర్వాత దూరం జరిగితే అందుకు కారణం సవాలచ్చ ఉండొచ్చు. స్వార్థమే తప్పించి ఇంకేమీ ఉండదని అనుకోవటమూ తప్పే. ప్రేమించిన అమ్మాయి పక్కాగా పెళ్లి చేసుకోవాలని.. లేదంటే ప్రాణాలు తీసినా తప్పే లేదన్నట్లుగా వ్యవహరించే సైకో ప్రేమికులు కొందరు ఉంటారు. ఇప్పుడు అలాంటి మైండ్ సెట్ తోనే సంగారెడ్డి జిల్లాకు చెందిన రమ్య అనే యువతిని దారుణంగా హత్య చేశారు.ఈ మర్డర్ మిస్టరీని పోలీసులు ఛేధించారు. ప్రేమించిన తర్వాత పెళ్లికి తల్లిదండ్రులు ఒప్పుకోని నేపథ్యంలో ప్రేమించినోడ్ని రమ్య పక్కన పెట్టిందని.. ఆ కోపంతో కక్ష కట్టిన ప్రవీణ్ కుమారు ఆమెను హత్య చేశాడు. అనంతరం ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసినా.. బతికిపోయాడు. తనకు దక్కనిది ఇంకెవరికీ దక్కకూడదన్న ఉద్దేశంతోనే ఈ తరహా దారుణానికి పాల్పడినట్లుగా చెబుతున్నారు.మెదక్ జిల్లాకు చెందిన పాతికేళ్ల ప్రవీణ్ కుమార్.. బండ్లగూడలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే 23 ఏళ్ల రమ్యతో కొన్నేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. తన ప్రేమ విషయాన్ని రమ్య తల్లిదండ్రులకు ప్రవీణ్ కుమార్ చెప్పాడు. ఇద్దరం ఒకరినొకరం ఇష్టపడుతున్నామని.. పెళ్లి చేసుకుంటామని చెప్పగా.. అందుకు రమ్య తల్లిదండ్రులు ఒప్పుకోలేదు.ఇటీవల కాలంలో రమ్య తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అప్పటి నుంచి రమ్య అతడ్ని దూరం పెడుతోంది. వారం రోజులుగా ప్రవీణ్ ఫోన్ చేస్తున్నా.. ఫోన్ కాల్ ఎత్తటం లేదు.దీంతో రగిలిపోయిన ప్రవీణ్.. తనకు దక్కనిది ఇంకెవరికీ దక్కకూడదన్నట్లుగా భావించి.. ఆమెను హత్య చేసేందుకు ప్లాన్ చేశాడు. సోమవారం ఉదయం రమ్య తల్లిదండ్రులకు ఆఫీసుకు వెళ్లిన తర్వాత.. ఆమె ఇంటి వెనుక వైపు నుంచి ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెతో వాగ్వాదానికి దిగాడు.అనంతరం ఆవేశంతో ఆమెపై కత్తి దూసి.. గొంతు కోసి చంపాడు. తాను కూడా బతక్కూడదన్న ఉద్దేశంతో కత్తితో పొడుచుకున్నాడు. అయితే.. అతడి సూసైడ్అటెంప్ట ఫలించలేదు. ప్రస్తుతం ప్రవీణ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రేమ పగను.. ప్రతీకారాన్ని పెంచుతుందా? ఒకవేళ అదే నిజమైతే.. అది ప్రేమ ఎంత మాత్రం కాదు. ప్రేమ త్యాగాన్ని కోరుతుందన్న మాటకు భిన్నంగా ప్రతీకారంతో ప్రాణాలు తీస్తున్నది ప్రేమ ఎంత మాత్రం కాదు. ప్రేమించినోళ్లు తమకు దక్కకుంటే ప్రాణాలు తీయాలన్న మైండ్ సెట్ ఉన్నోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# ఉగ్రవాది గురించి బుకాయించి పరువు తీసుకొన్న పాక్ మాజీ మహిళా మంత్రి!



**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్ లోని ఉగ్రశిబిరాలను ధ్వంసం చేసింది. ఈ సమయంలో సుమారు 100 మంది వరకూ ఉగ్రవాదులు మృతి చెందారు! ఈ సమయలో మురిద్కేలోని లష్కరే శిబిరంపై జరిగిన దాడిలో మృతి చెందిన వారికి నిర్వహించిన అంత్యక్రియల్లో అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నాడు. అయితే అతడు ఉగ్రవాది కాదని పాక్ వాదించింది. ఈ సమయంలో ప్రపంచానికి రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయింది! అవును... ఆపరేషన్ సిందూర్ కారణంగా మృతిచెందిన ఉగ్రవాదుల అంత్యక్రియల్లో... ఉగ్రమూకలతో పాక్ కు ఉన్న అనుబంధం మరింత అధికారికంగా వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ ఖర్ ఇటీవల ఓ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంతర్జాతీయ ఉగ్రవాదిని 'సాధారణ వ్యక్తి' అంటూ వెనకేసుకొచ్చారు. ప్రపంచం ముందు పరువు పోగొట్టుకున్నారు! వివరాల్లోకి వెళ్తే... ఇటీవల హీనా రబ్బానీ ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడంతో చనిపోయిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు ఉగ్రవాది హఫీజ్ అబ్దుల్ రవూఫ్ నేతృత్వం వహించాడని.. అతడిని అంతర్జాతీయ టెర్రరిస్టుగా అమెరికా ప్రకటించిందనే విషయానికి సంబంధించిన ప్రశ్నను ఎదుర్కొన్నారు. దీనికి ఆమె చెప్పిన సమాధానంతో పరువు పోగొట్టుకున్నారు.

ఇందులో భాగంగా.. 'మీరు ఉగ్రవాది అంటూ ఆధారాల్లో చూపెడుతున్న వ్యక్తి.. మీరు అనుకొంటున్న ఉగ్రవాది కాదు. పాకిస్థాన్ లో లక్షల మంది అబ్దుల్ రవూఫ్ లు ఉన్నారు' అని ఆమె పేర్కొన్నారు. దీంతో ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టు స్పందిస్తూ.. అంత్యక్రియల సందర్భంగా విడుదల చేసిన ఫోటో ఫేక్ అని చెప్పలేదని.. ఆ వ్యక్తి ఓ రాజకీయ పార్టీకి చెందినవాడని, అతడి నేషనల్ ఐడీ నెంబర్ ను కూడా విడుదల చేశారని గుర్తుచేశారు. ఇదే సమయంలో... అమెరికా ఉగ్ర జాబితాలో వెల్లడించిన ఐడీ, ఆ నేషనల్ ఐడీ ఒకటే అని సదరు జర్నలిస్టు హీనాకు వివరించారు. దీంతో... ఒక్కసారిగా షాకైన హీనా రబ్బాని.. సర్దిచెప్పుకొనేందుకు ప్రయత్నించారు. అప్పటికీ పాక్ ఐఎస్ఐ ప్రజాసంబంధాల విభాగం మాత్రం భారత్ చెబుతున్న రవూఫ్ అతడు కాదన్న విషయాన్ని వెల్లడించిందని హీనా చెప్పుకొచ్చారు. ఆమె ఎంత సమర్థించుకున్నా.. ప్రపంచానికి అసలు వాస్తవం తెలుసనే విషయాన్ని మరిచారు!కాగా... భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో 9 ఉగ్రవాద శిబిరాలు, సుమారు 100 మంది ఉగ్రమూకలు మట్టుపెట్టబడిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో మరణించిన ఉగ్రవాదులకు అంత్యక్రియలు జరిగాయి. ఇందులో భాగంగా... లాహోర్ సమీపంలోని మురిద్కేలోని ఉగ్రవాద సంబంధిత ప్రదేశంలో జరిగిన అంత్యక్రియల్లో ప్రార్థనలకు లష్కరే తోయిబా ఉగ్రవాది హఫీజ్ అబ్దుల్ రవూఫ్ నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే.

ఇలా అతడు నాయకత్వం వహించిన ఉగ్రవాదుల అంత్యక్రియల కార్యక్రమంలో పాకిస్థాన్ ఆర్మీ సిబ్బంది, పోలీసులు కూడా పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. అయితే... ఆ అంత్యక్రియల్లో పాల్గొన్న అబ్దుల్ రవూఫ్.. మీరనుకుంటున్న అబ్దుల్ రఫూవ్ కాదంటూ బుకాయించిన పాక్ నేత తాజాగా పరువు పోగొట్టుకున్నారు.

# పిఠాపురం వర్మకే...మిత్రుల సీట్లలో టీడీపీ మాస్టర్ ప్లాన్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ మొత్తం 175 స్థానాల్లో పోటీ చేయగల క్యాడర్ ని కలిగి ఉంది. ఆ పార్టీది నాలుగు దశాబ్దాల పై దాటిన చరిత్ర. గ్రౌండ్ లెవెల్ లో టీడీపీకి మంచి బలం ఉంది. క్యాడర్ బేస్డ్ పార్టీగా ఇన్నేళ్ళలోనూ టీడీపీ పటిష్టంగా ఉంది. అటువంటి టీడీపీ పొత్తుల పేరుతో కొన్ని సీట్లు త్యాగం చేయడం అంటే కష్టమే. అయితే పై స్థాయిలో అధికారం దక్కాలీ అంటే కొన్ని ఇలాంటివి తప్పవు.అంత మాత్రం చేత పొత్తులో పోటీ చేసి మిత్రులు గెలిచిన సీట్లలో టీడీపీ వదులుకోవడం అన్నది ఉండదు కదా. పైగా బలమైన క్యాడర్ ఉన్న చోట టీడీపీ పార్టీని అలక్ష్యం చేసే ఆలోచనలో అసలే లేదని అంటున్నారు. రాజకీయాల్లో పొత్తులు అన్నవి వ్యూహాత్మకమైన ఎత్తుగడలు పార్టీకి అన్ని చోట్లా బలం ఉండాలి, బలగం ఉండాలి, రేపటి రోజున ఎక్కడ నుంచి ఎవరు పోటీ చేసినా క్యాడర్ నుంచి మంచి రియాక్షన్ రావాలి. అంతా సహకరించాలి అంటే తమ పార్టీని ఎలాంటి రాజీలూ పేచీలు లేకుండా డెవలప్ చేసుకోవాల్సిందే అన్నది టీడీపీ ఆలోచన.అందుకే మిత్రులు గెలిచిన సీట్లలో ఎలాంటి మొహమాటాలకు పోకుండా బలమైన వారిని సమర్థులను ఎంపిక చేసుకుని మరీ ఆయా నియోజకవర్గాలకు ఇంచార్జిలుగా చేయడం మీద టీడీపీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ ఇంచార్జి బాధ్యతలను వర్మకే తిరిగి అప్పగించారు. ఆయన పార్టీ కోసం పాతికేళ్ళుగా కష్టపడుతూ వస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేగా కూడా మంచి మెజారిటీతో గెలిచి వచ్చారు.ఈసారి పొత్తులో ఈ సీటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి వెళ్ళిపోయింది. అయినా సరే పొత్తు ధర్మంలో భాగంగా పవన్ ని భారీ మెజారిటీతో గెలిపించే విషయంలో వర్మ చాలా కష్టపడ్డారు. ఇక వర్మకు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పారు. కానీ ఆ హామీ నెరవేరలేదు.

అయితే ఇటీవల కాలంలో చంద్రబాబు ఆయనను పిలిచి మాట్లాడారు అని అంటున్నారు. తగిన న్యాయం చేస్తామని చెప్పి మరీ ఇంచార్జి పదవిని ఆయనకే ఇచ్చారని అంటున్నారు. దాంతో పిఠాపురంలో టీడీపీ సైకిల్ ని పరుగులు పెట్టించే పనిలో వర్మ కచ్చితంగా ఉంటారు అనడంలో సందేహం లేదు. అక్కడ జనసేన పటిష్టం అవుదామని చూస్తోంది. ఎందుకంటే ఏకంగా పవన్ కళ్యాణ్ అక్కడ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. పైగా ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు. దాంతో ఇపుడు కాకపోతే మరెప్పుడు అన్నట్లుగా జనసేన దూకుడు చేస్తోంది. మరో వైపు టీడీపీ తన బలం కోల్పోకుండా వర్మ అన్ని విధాలుగా పరిశ్రమించి కాసుకొస్తున్నారు. ఒక దశలో జనసేన వర్సెస్ వర్మ అన్నట్లుగా కూడా పిఠాపురం పొలిటికల్ స్టోరీ సాగింది. అయినా సరే ఇపుడు ఏరి కోరి వర్మను ఇంచార్జిగా తిరిగి నియమించడం అంటే మిత్రుల విషయంలో రాజకీయం రాజకీయమే అన్నట్లుగా టీడీపీ స్టాండ్ ఉందని అంటున్నారు.

ఇక జనసేన 21, బీజేపీ 8 సీట్లలో గెలిచాయి. దాంతో ఈ 29 చోట్ల బలమైన నాయకులను ఇంచార్జిగా నియమిస్తున్నారు. ఇక్కడ క్యాడర్ కి జోష్ తెచ్చేలా ఉత్సాహవంతులైన ఇంచార్జిలను నియమించాలన్నది టీడీపీ ఆలోచన. ఆ విధగ్గా ఇదే వరసలో చూస్తే కాకినాడ రూరల్ నుంచి పిల్లి అనంతలక్ష్మి ఇంచార్జిగా ఉన్నారు. సహాయ సమన్వయకర్తగా కటకంశెట్టి బాబీ ఉన్నారు. పిల్లి అనంతలక్ష్మి మీద పార్టీలో అసంతృప్తి ఉండడంతో బాబీకే ఈ ఇంచార్జి పగ్గాలు అప్పగిస్తారు అని అంటున్నారు.అలాగే అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జిగా బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తనయుడు మనోజ్ కి బాధ్యతలు అప్పగించనున్నారు అంటున్నారు. అలాగే రాజోలు ఇంచార్జిగా గుబ్బల శ్రీనివాస్, విజయవాడ పశ్చిమకు ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, తిరుపతికి సుగుణమ్మ, అవనిగడ్డకు బొబ్బా గోవర్ధనలను నియమిస్తారు అని అంటున్నారు. ఇంతే కాకుండా మిత్రులు ఉన్న మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలలో కూడా బలమైన ఇంచార్జిలను నియమించాలని పార్టీ ఆలోచిస్తోందిట. మొత్తానికి మిత్రులకు విడిచిపెట్టిన సీట్లు వారు గెలిచిన చోట్ల కూడా సైకిల్ జోరు చేసేలా మాస్టర్ ప్లాన్ తో అధినాయకత్వం ఉందని అంటున్నారు.

# జగన్ ఈవెంట్ పాలిటిక్స్.. టీడీపీ ట్వీట్ల వార్



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి జగన్ బంగారుపాళ్యం పర్యటనపై టీడీపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ కార్యకర్తలు అత్యుత్సాహం చూపారని, మామిడి కాయలను నేలపై పారబోసి ట్రాక్టర్లతో తొక్కి వికృత చేష్టలకు పాల్పడ్డారని ధ్వజమెత్తింది. టీడీపీ అధికారిక ఎక్స్ ఖాతాలో వైసీపీ కార్యకర్తల వీడియోలు మామిడికాయలను రోడ్డుపై పారబోసి ట్రాక్టర్లతో తొక్కంచిన వీడియోలు, ఫోటోలను షేర్ చేసింది. ఈ సంఘటనపై వరుస ట్వీట్లతో టీడీపీ హోరెత్తించింది.

అంతేకాకుండా మాజీ సీఎం జగన్ పర్యటనను ఈవెంట్ పాలిటిక్స్ గా అభివర్ణించింది. మిర్చి రైతుల పరామర్శ పేరిట గుంటూరు మిర్చియార్డులో మిర్చి బస్తాలను మాయం చేశారని, పొగాకు రైతుల పరామర్శ పేరుతో పొగాకు బేళ్ల ధ్వంసం చేశారని, మామిడి రైతుల పరామర్శ పేరుతో మామిడి పంట నాశనం చేశారని మరో ట్వీట్ చేసింది. ఇక దొంగతనం.. ధ్వంసం.. నాశనం... ఇదే జగన్ మార్క్ పరామర్శ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది.

ఇక బంగారుపాళ్యం పర్యటనపై మరో ట్వీట్ లో "మామిడి రైతుల పరామర్శ పేరిట చేపట్టిన ఈవెంట్ పాలిటిక్స్ లో వైసీపీ నేతల వికృత చర్యలు" అంటూ మామిడికాయలను రోడ్డుపై పారబోసిన వీడియోను షేర్ చేసింది. మార్కెట్ లో అమ్మాల్సిన మామిడి కాయలను తెచ్చి రోడ్డుపై కాన్వాయ్ ముందు పోసి డ్రామా అడుతున్నారని మండిపడింది. "జగన్ వచ్చిన సమయంలో రోడ్డుపై పంటను పారబోసి ఆ దృశ్యాల ద్వారా తప్పుడు ప్రచారం చేసేందుకు ఈవెంట్ ప్లానింగ్. తమను ఎవరూ పట్టించుకోలేదని అని జగన్ కు రైతులు చెప్పినట్లుగా చిత్రీకరించడానికి స్క్రిప్ట్ ప్రకారం రోడ్డుపై మామిడి పంట." అంటూ ఆ ట్వీట్ లో విమర్శలు గుప్పించింది.

ఇక మరో ఫొటోను షేర్ చేస్తూ కాన్వాయ్ కింద పడి చావడం ఎందుకు అనుకున్నారో ఏమో దరిదాపుల్లోకి ఎవరూ రావడం లేదంటూ జగన్ వాహనం వద్ద జనం లేని ఫొటోను షేర్ చేసింది టీడీపీ. అదేవిధంగా ముందుగా అనుకున్న స్క్రిప్ట ప్రకారం మామిడి కాయలను రోడ్డుపై పారబోశారంటూ మరో ట్వీట్ వదిలింది. "జగన్ మెప్పు కోసం మామిడి పంటను రోడ్డు మీద పారబోయాలని ఒక్కరోజు ముందే ప్లాన్ చేసిన వైసీపీ బ్యాచ్....అనుకున్న డ్రామా ప్రకారం పైశాచికంగా మామిడి పంట రోడ్డుమీద పారబోసిన పిల్ల సైకోలు" అంటూ ఆ ట్వీట్ లో ఘాటు వ్యాఖ్యలు చేసింది.

ఈ ట్వీట్ వార్ లోనే మరోసారి "రైతులు కష్టపడి పండించిన పంటని, ట్రాక్టర్ కి వైసీపీ జెండాలు కట్టుకుని, రోడ్డు పై పారబోస్తూ, వాటిని టైర్లతో తోక్కిస్తూ, కాళ్ళతో తొక్కుతూ, డ్యాన్సులు వేస్తున్నారు ఉన్మాదులు. ఈ ఉన్మాదుల వికృత చేష్టలు చూసి, జగన్ నవ్వుకుంటూ ఆనంద పడుతున్నాడు" అంటూ వ్యాఖ్యానించింది. టీడీపీ అధికారిక ఖాతాలో సుమారు పది ట్వీట్లు వేయడంతో జగన్ పర్యటనను ఆ పార్టీ ఎంతో సీరియస్ గా తీసుకుందని అర్థమవుతోందని అంటున్నారు విశ్లేషకులు. అయితే టీడీపీ వరుస ట్వీట్లతో విరుచుకుపడితే విపక్షం నుంచి కేవలం ఒక ట్వీట్ పై మాత్రమే స్పందన కనిపించింది. జగన్ పర్యటనలో జనం లేరన్న టీడీపీ ఫొటో ట్వీట్ ను జత చేస్తూ భారీ జనసమూహంతో జగన్ ఉన్న ఫొటోను పోస్టు చేసింది. టీడీపీ ఫేక్ ప్రచారాలు చేస్తోందని వైసీపీ కౌంటర్ ఇచ్చింది.

## ముల్డర్ బయపడ్డాడు.. తప్పు చేశాడు.. నేనైతే కొట్టేవాడిని:
# సఫారీ ఆల్ రౌండర్‌పై గేల్ విమర్శలు




**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా ఆల్ రౌండర్ వియాన్ ముల్డర్ టెస్టుల్లో లారా సాధించిన 400 పరుగుల వ్యక్తిగత స్కోర్ ను బ్రేక్ చేసేందుకు సువర్ణావకాశం లభించినా వదులుకోవడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. బులవాయో వేదికగా క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ లో ముగిసిన రెండో టెస్టు రెండో రోజు 367 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఉన్నప్పుడు సౌతాఫ్రికా తమ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. దీంతో ప్రపంచ క్రికెట్ మొత్తం ఒక్కసారిగా షాక్ కు గురైంది. లంచ్ తర్వాత రెండో సెషన్ లో ఈ సఫారీ కెప్టెన్ లారా రికార్డ్ బ్రేక్ చేస్తాడని క్రికెట్ అభిమానులు ఉత్కంఠగా ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలింది. ముల్డర్ నిర్ణయంపై వెస్టిండీస్ విధ్వంసకర వీరుడు క్రిస్ గేల్ విమర్శలు వ్యక్తం చేశాడు.

ఒక రేడియో కార్యక్రమంలో మాట్లాడుతూ.. గేల్ తన నిర్ణయం పట్ల నిరాశ వ్యక్తం చేశాడు. అలాంటి అవకాశం వచ్చినప్పుడు వదులుకోకూడదని ప్రశ్నించాడు. " నాకు 400 పరుగులు చేసే అవకాశం వస్తే.. నేను 400 పరుగులు చేసేవాడిని. ఇలాంటి అవకాశం ఎప్పుడో ఒకసారి మాత్రమే జరుగుతుంది. ముల్డర్ మళ్ళీ ఎప్పుడు ట్రిపుల్ సెంచరీ చేస్తారో తెలియదు. మీకు అవకాశం దొరికినప్పుడు మీరు భయపడకూడదు. రికార్డ్ బ్రియాన్ లారాతోనే ఉండాలని కోరుకుంటున్నానని చెప్పాడు. బహుశా అతను భయాందోళనకు గురై ఉండవచ్చు. ఆ పరిస్థితిలో ఏమి చేయాలో అతనికి తెలియలేదు. నేను చెప్పినట్లుగా, అతను భయపడ్డాడు. రికార్డ్ బ్రేక్ చేయకుండా తప్పు చేశాడు". అని గేల్ చెప్పుకొచ్చాడు.

ఈ మ్యాచ్ లో సౌతాఫ్రికా కెప్టెన్ ముల్డర్ కావడం విశేషం. కెప్టెన్ గా ముల్డర్ జట్టు విజయం తీసుకున్న ఈ నిర్ణయం అందరి మనసులను గెలుచుకుంది. లంచ్ తర్వాత 5-10 ఓవర్లు సౌతాఫ్రికా బ్యాటింగ్ చేసినా లారా రికార్డ్ ను ముల్డర్ బ్రేక్ చేసేవాడు. అయితే 34 పరుగుల దూరంలో ప్రపంచ రికార్డ్ ఉన్నప్పటికీ తాను నిస్వార్థంగా జట్టు కోసం ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేశాడు. దీంతో 367 పరుగులతో ముల్డర్ నాటౌట్ గా తన ఇన్నింగ్స్ ను ముగించాడు. దీంతో లారా రికార్డ్ పదిలంగా మిగిలింది. ఈ మ్యాచ్ లో ఓవరాల్ గా ముల్డర్ 334 బంతుల్లో 44 ఫోర్లు, 4 సిక్సర్లతో 367 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ నిర్ణయంపై కొంతమంది ప్రశంసించినా మరికొందరు నిరాశకు గురయ్యారు.

# కళ్లు చెదిరే రేంజ్‌కు పెరిగిన IPL బ్రాండ్ వాల్యూ..
# ముంబై, చెన్నైని వెనక్కి నెట్టి టాప్ ప్లేస్‌కు ఆర్సీబీ

**హైదరాబాద్ పెన్ పవర్:** క్యాచ్ రిచ్ లీగ్ ఐపీఎల్?కు ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ ఉంటారు. క్రికెట్ ఆడే దేశాల్లో ఐపీఎల్ అంటే తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఇంత క్రేజ్ ఉన్న ఐపీఎల్ విలువ రోజురోజుకు మరింత పెరుగుతోంది. ఈ విషయాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహాన్ వెల్లడించింది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహాన్ లోకే తాజా నివేదిక ప్రకారం.. ఈ ఏడాది ఐపీఎల్ వ్యాపార విలువ 12.9 శాతం పెరిగి 18.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది.




గత సంవత్సరం ఐపీఎల్ బ్రాండ్ వాల్యూ 13.8% పెరిగి 3.9 బిలియన్ డాలర్లకు చేరుకుందని నివేదిక పేర్కొంది. My11circle, Angel One, RuPay, CEAT%Â£"- నాలుగు అసోసియేట్ స్పాన్సర్ స్లాట్‌లను విక్రయించడం బీసీసీఐ రూ.1,485 కోట్లు ఆర్జించిందని బ్యాంక్ హౌలిహాన్ వెల్లడించింది. టాటా గ్రూప్‌తో ఐపీఎల్ టైటిల్-స్పాన్సర్‌షిప్ హక్కులను 2028 వరకు రూ. 2,500 కోట్లకు ఒప్పందం చేసుకుంది.ఇక, ఐపీఎల్ ఫ్రాంచైజీల విషయానికొస్తే 2025 టోర్నీ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) 269 మిలియన్ డాలర్ల బ్రాండ్ వాల్యూతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. -ఆర్సీబీ బ్రాండ్ వాల్యూ గత సంవత్సరం 227 మిలియన్ డాలర్ల ఉంది. రెండవ స్థానంలో టోర్నీలో అత్యధిక టైటిల్స్ గెలిచిన ముంబై ఇండియన్స్ నిలిచింది. 2025లో ముంబై బ్రాండ్ విలువ 242 మిలియన్లకు పెరగగా.. 2024లో 204 మిలియన్లు ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ 235 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో మూడవ స్థానానికి పరిమితమైంది. 2025 ఐపీఎల్ రన్నరప్ పంజాబ్ కింగ్స్ బ్రాండ్ విలువ ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. 2024 కంటే పంజాబ్ బ్రాండ్ విలువ 39.6% పెరిగింది. వీక్షకుల సంఖ్య విషయానికి వస్తే IPL 2025 ఫైనల్‌ను జియో హాట్‌స్టార్‌లో 67.8 కోట్లకు పైగా వీక్షించారు. -ఇది 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ కంటే ఎక్కువ వ్యూయర్ షిప్.

# నాలుగేళ్ల తర్వాత ప్లేయింగ్ 11లో ఆర్చర్.. లార్డ్స్ టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాతో లార్డ్స్ వేదికగా జరగబోయే మూడో టెస్టుకు ఇంగ్లాండ్ తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను అధికారికంగా ప్రకటించింది. గురువారం (జూలై 10) ప్రారంభం కానున్న ఈ మ్యాచ్ కు ఒక రోజు ముందు ఇంగ్లాండ్ తమ తుది జట్టును వెల్లడించింది. రెండో టెస్టులో ఇంగ్లాండ్ తో బరిలోకి దిగిన జట్టులో ఒక మార్పు చేసింది. ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్ స్థానంలో ఆర్చర్ కు ఇంగ్లాండ్ తుది జట్టులో చోటు కల్పించింది. దీంతో నాలుగేళ్ల తర్వాత ఆర్చర్ టెస్ట్ క్రికెట్ లోకి అడుగుపెట్టబోతున్నాడు. బుధవారం (జూలై 9) ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించిన ప్లేయింగ్ 11 లో 5 గురు బ్యాటర్లు.. ఒక వికెట్ కీపర్.. ఒక ఆల్ రౌండర్.. ముగ్గురు స్పెషలిస్ట్ సీమర్లు ఉన్నారు.




ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ విషయానికి వస్తే ఓపెనర్లుగా బెన్ డకెట్, జాక్ క్రాలీ ఆడనున్నారు. మూడో స్థానంలో పోప్ బ్యాటింగ్ చేస్తాడు. సీనియర్ బ్యాటర్ జో రూట్, యువ సంచలనం హ్యారీ బ్రూక్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో బ్యాటింగ్ కు వస్తారు. కెప్టెన్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ ఆరో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సూపర్ ఫామ్ లో ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ జెమీ స్మిత్ ఏడో స్థానంలో ఆడతాడు. సీనియర్ బౌలర్ క్రిస్ వోక్స్, ఆర్చర్,బ్రైడాన్ కార్సే ఫాస్ట్ బౌలింగ్ బాధ్యతలు పంచుకుంటారు. స్పెషలిస్ట్ స్పిన్నర్ గా షోయబ్ బషీర్ కు తుది జట్టులో స్థానం దక్కింది. యువ బ్యాటర్ బెథెల్‌తో పాటు, సామ్ కుక్, జామీ ఓవర్టన్ లకు రెండో టెస్టులోనూ బెంచ్ కు పరిమితమయ్యారు. గస్ అట్కిన్సన్ ఇంకా గాయం నుంచి కోలుకోలేదు. నాలుగో టెస్ట్ సమయానికి పూర్తి ఫిట్ నెస్ సాధించే అవకాశాలు ఉన్నాయి.

**నాలుగేళ్ళ తర్వాత ఆర్చర్ రీ ఎంట్రీ..**

ఆర్చర్ తన చివరి టెస్ట్ మ్యాచ్ ను 2021 ఫిబ్రవరిలో ఆడాడు. ఆ తర్వాత మోచేయికి శస్త్రచికిత్స చేపించుకొని సుదీర్ఘ ఫార్మాట్ కు దూరమయ్యాడు. ఈ క్రమంలో 2023 లో జరిగిన యాషెస్ తో భారత్ వేదికగా జరిగిన వన్డే వరల్డ్ కప్ కు దూరమయ్యాడు. జూలై 2న ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌తో ఇంగ్లాండ్ రెండో టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ లో ఆర్చర్ బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇంగ్లాండ్ జట్టులో అనుభవం లేని ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. ఆర్చర్ జట్టులోకి వస్తే ఇంగ్లాండ్ బౌలింగ్ సమస్యలు తీరినట్టే.



జెనీలియా డిసౌజా తన సాంప్రదాయ ర్యాంప్ ప్రదర్శనతో తల తిప్పింది

# వ్యాయామం లేకుండానే వెయిట్ తగ్గిన నటి!

సెలబ్రిటీలు ఫిట్ నెస్ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటారు. ఫిట్ నెస్...రూపాన్ని కోల్పోతే సినిమాలతో మెప్పించే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో సెలబ్రిటీలంతా జాగ్రత్తగా మరొకరు ఉండరన్నది అతి శయోక్తి కాదు. ఇలా ఎంత చేసినా ఒక్కోసారి అనుకోని సమస్యలు ఎదురవుతుంటాయి. అయినా ఆ పరిస్థి తుల్లోకి పూర్తి గా వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు. మహమ్మారి క్యాన్సర్ నే జయించిన సెలబ్రి టీలు ఎంతో మంది. ఈ విషయంలో సెలబ్రిటీలు ఎంతో మందికి ఇన్ స్పిరేషన్ అని చెప్పాలి.

ఈ నేపథ్యంలో మహమ్మారి నుంచి బయడ పడిన సెలబ్రిటీలు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. ఎన్ జీవోలతో కలసి సమాజంలో తమ వంతు బాధ్యతగా పని చేస్తుంటారు. తాజాగా విద్యా బాలన్ కూడా అధిక బరువుతో తానెంత బాధపడిందన్న విషయాన్ని రివీల్ చేసింది. అది బరువు కాదు.. అధిక వాపు తో తీవ్రమైన అనారోగ్య బారి నుంచి తానెలా బయడ పడిందన్నది నలుగురుకి షేర్ చేసింది. కెరీర్ ఆరంభం నుంచే అధిక బరువుతో ఉండేదాన్ని. ఈ క్రమంలో చాలా విమర్శలు ఎదుర్కున్నా. సన్న బటడానికి ఎన్నో ప్రయత్నాలు చేసా. శరీరంలో కొవ్వు పేరుకుపోయిందని చేయాల్సినవన్నీ చేసా. కానీ ఏం లాభం లేదు. కానీ జిమ్ కు వెళ్లడం మానేసిన తర్వాత బరువు తగ్గాను. నా శరీరంలో ఉంది బరువు కాదు. వాపు అని గుర్తించా. దీనికి శాశ్వత పరిష్కారం కోసం ఈ ఏడాది మొదట్లో చెన్నైకి చెందిన %-%అముర' అనే న్యూట్రిషనల్ గ్రూప్‌ను సంప్రదించాను. తను శరీరంలో పేరుకుపోయింది కొవ్వు కాదని, అది కేవలం ఇన్ఫ్లమేషన్( అంటే శరీరంలో ఉండే ఒకరకమైన వాపు) అని తెలిపారు.వారు నాకోసం ఇన్ఫ్లమేషన్‌ను తొలగించే ప్రత్యేకమైన డైట్‌ను సూచిం చారు. అది నాకు మంచి ఫలితా న్నిచ్చింది. చాలా వరకూ బరువు తగ్గిపోయాను. అధిక భారం శరీరానికి చాలా అసౌకర్యానికి గురి చేస్తుంది. ఇప్పుడు ఎంతో విశాలంగా అనిపిస్తుంది. స్నేహితులంతా స్లిమ్ గా ఉన్నావ్ అంటున్నారు. శరీరమంతా ఎంతో తేలికగా ఉంది. కానీ ఆ డైట్ మొదలు పెట్టిన తర్వాత ఎలాంటి వ్యాయామాలు చేయకూడదు అనే కండీషన్ మర్చిపోకూడదు. ఆ డైట్ కి-వ్యాయామానికి సెట్ కాదు. దీంతో జిమ్ మానేసి ఇంట్లో తింటూనే బరువు తగ్గాను%-% అని తెలిపింది.





ఎరుపు రంగులో అదితి బుధతోకి స్పైసీ స్టిల్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com